తెలుగు తెరపై
సోగ్గాడి సంతకం

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
జూలై 12, 2015



జన గోదావరి

తులసి బిజీ

అమ్మలెప్పుడూ బిజీగానే వుంటారు. నిజ జీవితంలోనే కాదు. తెర జీవితంలోనూ! అందుకు తులసి మంచి ఉదాహరణ. బాల నటిగా 'శంకరాభరణం తులసి' అన్న పేరు సంపాదించుకుంది. ఆ తర్వాత హీరోయిన్‌గా పలు చిత్రాల్లో చేసి ప్రేక్షకులనే కాక విమర్శకులనూ మెప్పించింది. ప్రస్తుతం ఈ తరం హీరోలకు తల్లిగా డిమాండ్ సంపాదించుకుంది. మహేష్ బాబు 'శ్రీమంతుడు'లోనూ కనిపించబోతోంది. దాదాపు చిత్రీకరణ అంతా పూర్తి చేసుకున్న ఆ సినిమాలో తన పాత్ర గురించి పూర్తిగా చెప్పడంలేదు కానీ 'చాలా కీలకమైన పాత్ర' అంటోంది. కొరటాల శివ తనకు అవకాశం ఇచ్చినందుకు ఎంతో ఆనందంగా వుందంటోంది. ఈ మధ్య కాలంలో చేసిన పాత్రలన్నింట్లోకి ఇది గుర్తుండిపోతుందన్నది తులసి మనసులోని మాట. ప్రిన్స్‌తో ఆమెకు కొన్ని సన్నివేశాలు కూడా వుంటాయట. హీరో కృష్ణ కుటుంబంతో ఆమెకు చాలా సాన్నిహిత్యం వుందని, మహేష్ చిన్నప్పుడు రెండు సార్లు పుట్టినరోజు పార్టీకి కూడా హాజరయ్యానని చెప్తోంది. మహేష్ సెట్‌పైన అందరితో కలిసిపోతాడని కితాబు ఇస్తోంది. గతంలో 'డార్లింగ్'లో ప్రభాస్ తల్లిగా, 'జులాయి'లో అల్లు అర్జున్ అమ్మగా చేసింది. అవి రెండూ సూపర్ డూపర్ హిట్లు కావడంతో ఆమెకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయనుకోవాలి. 'తెలుగు, తమిళ్ సినిమాల్లో చాలా ఆఫర్లు వస్తున్నాయి. పాత్ర నిడివి ఎంతన్నది పట్టించుకోను. దాని ప్రాధాన్యతను గురించి మాత్రమే ఆలోచించి సంతకం చేస్తుంటాను' అంటోంది. ఇకపోతే టాలీవుడ్‌లో యువ హీరోలతో కలిసి చేస్తున్నందుకు చాలా సంతోషంగా వుందంటోంది. కొరటాల శివ, శ్రీకాంత్ అడ్డాల, త్రివిక్రమ్ చిత్రాలలో కన్పించే గ్రామీణ వాతావరణం ఆమెకెంతగానో నచ్చేసిందట. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు'లో చూపించిన పల్లె అందాలామెను కట్టిపడేశాయట. మహేష్ హీరోగా శ్రీకాంత్ అడ్డాల నూతన చిత్రం 'బ్రహ్మోత్సవం'లోనూ తులసి కనిపించనుంది. మొత్తం మీద తులసి బిజీ బిజీ. ●

ఆలియా అభిరుచులు

బాలీవుడ్ తారగా, మహేష్ భట్ ముద్దుల కూతురుగా సుపరిచితురాలు ఆలియా భట్. దానికంటే ముందు బాలనటి కూడా. ' సంఘర్ష్' లో ప్రీతి జింటా చిన్ననాటి పాత్రలో మెరిసి మురిపించింది. అప్పడప్పడు గాయని అవతారం కూడా ఎత్తి మెప్పిస్తుంటుంది. ఆమె గురించి మనకు తెలీని బుల్లి బుల్లి కబుర్లు....

- ఆలియా ఉదయాన్నే లేచి ఫిట్‌నెస్ కోసం వ్యాయామం తప్పకుండా చేస్తుంది. ఒక్కరోజు కూడా ఎగనామం పెట్టదు.
- ఇష్టమైన కార్టూన్ షో 'టామ్ అండ్ జెర్రీ'.
- ఇప్పుడు వస్తున్న టీవీ కార్యక్రమాల్లో 'గరల్స్' అంటే ఇష్టం.
- ఈ ఏడాది వచ్చిన చిత్రాలలో దీపికా పదుకొనే అమితాబ్ బచన్ సినిమా 'పికు' అంటే ఇష్టం.
- చాక్లెట్ ఐస్ క్రీమ్ అంటే చాలా చాలా ఇష్టం.
- తొలి చిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' షూటింగ్ మొదటి రోజు ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం.
- భారత దేశంలో ఇష్టమైన ప్రదేశం హిమాచల్ ప్రదేశ్. అందునా అక్కడి పర్వతాలంటే మరీను.
- భోజనానంతరం పెసరపప్పు హల్వా తినాలని ఉవ్విళ్లూరుతుంది.
- గ్రీన్ టీ, వేరుశనగ గుళ్లు అంటే ఆలియాకు చాలా ఇష్టం.
- అభిమానించే ముగ్గురు...తల్లి సోనీ రాజ్దాన్, దర్శకుడు కరణ్ జోహార్, సోదరి షాహీన్ భట్.
- అప్పడప్పుడు సెట్స్ మీదే కునుకు తీసేస్తుంటుంది. అది తనకు నచ్చదు. కానీ అలా జరిగిపోతుంటుందంతే.
- ప్రేమ పెళ్లి ఇష్టమా! పెద్దలు కుదిర్చిన వివాహం ఇష్టమా! అనడిగితే... ప్రేమతో ఏర్పడిన బంధాన్ని ఇష్టపడతానని చెప్తుంది.
- సంతోషం వెనక దాగిన రహస్యం ఏమిటంటే...పని...పని...పని అనేస్తుంది.

●

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

మౌనమేలనోయి...

చుట్టూ కోటానుకోట్ల ప్రాణులు. దేని ప్రత్యేకత దానిదే. అన్నిట్లోకి మనిషికి మాత్రమే వున్న ప్రత్యేకత మాట. ఆ మాటలతోనే భావాలను పంచుకుంటాం. ఆ మాటలతోనే ఇతరుల మనసులు కొల్లగొడతాం. దగ్గరవుతాం. ఒక్కోసారి దూరం చేసేది కూడా ఆ మాటే. ఇన్ని విశిష్టతలున్న మాట కన్నా మహత్తరమైంది మౌనం. మాట వెండి. మౌనం బంగారం అంటుంటారు పెద్దలందుకే. మాటతో ఎన్ని ప్రయోజనాలున్నాయో... మౌనంతోనూ అన్ని ఉపయోగాలున్నాయి. ఎదుటివారికి మౌనంతోనే సమాధానం చెప్పొచ్చు. అయిష్టతను, ఆగ్రహాన్ని ఒక్క మాట మాట్లాడకుండా మౌనంతో వ్యక్తీకరించవచ్చు. అయితే అంగీకారాన్ని కూడా మౌనమే తెలియచేస్తుంటుంది అప్పడప్పడు! అందుకేనేమో మౌనం అర్ధాంగీకారం అన్నారు! ఆచార్య ఆత్రేయ 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా...' అన్నారందుకేనేమో!

మౌనం మంచి ఆయుధం కూడా. అలకను తెలియచేయడానికి, అనుకున్నది సాధించుకోవడానికి మౌనవ్రతం చక్కటి ఎంపిక. చిన్నారులు, మహిళలు ఎక్కువగా దీన్నే ఉపయోగిస్తుంటారు. అన్యాయం జరిగినప్పడు మౌన పోరాటాన్ని మించిన అస్త్రం మరొకటి లేదు. ఎప్పటికైనా సరే ఎంతటివారైనా దిగి రావాల్సిందే. చిన్న చిన్న పొరబాట్లు జరిగినప్పడు ఆదుకునేది కూడా ఈ మౌనమే. మరీ ముఖ్యంగా యువతను ఇది బాగా కాపాడుతుంటుంది.

సాదాసీదా జనం సంగతి తర్వాత. రాజకీయ నాయకుల జేబులో సదా సిద్ధంగా వుండే మహత్తర ఆయుధం మౌనం. తమ కోటాలో, గోదాలో అవినీతి, అవకతవకలు జరిగినప్పడు మౌన మునులైపోతుంటారు అకస్మాత్తుగా. దశాబ్దాల తరబడి అదే ముద్రను కాపాడుకునేవారూ వుంటారు. ఆ కోవకు చెందినవారిలో మాజీ ప్రధాని మన్మోహన్‌జీని ముందు పీఠిన చెప్పకోవచ్చు. ఎన్ని కుంభకోణాలు జరిగినా, స్కామ్‌లు వెలుగులోకి వచ్చినా, స్వయంగా తను బొగ్గు కుంభకోణంలో కూరుకున్నా, మీడియా ఎన్ని ప్రశ్నలు సంధించినా... మిన్ను విరిగి మీద పడినా... నోరు తెరవకుండా... మౌనంగా ... రెండు సార్లు పదవీ కాలాన్ని ఈజీగా లాగించేశారు.



◆ మనలో మాట

అప్పట్లో ఆయన మౌనం చూసి నవ్విన ... ఎగతాళి చేసిన నేతలే ఇవాళ అందలమెక్కారు. మాకు వారిలా మచ్చలు లేవు. స్వచ్ఛమైన వారం. అని తెగ గప్పాలు కొట్టుకున్నారు. ఏడాది అట్టా తిరిగిందో లేదో ఇట్టా అవినీతి పుట్ట బద్దలు కొట్టుకుని స్కాముల పాములు బైటకొచ్చేశాయి. కేంద్రమంత్రులు మొదలుకొని ముఖ్యమంత్రుల వరకు ఒకటే అవినీతి. అన్ని బడాయిలు చెప్పకున్నారు. ఇదేంటని మోడీగారు ఎక్కడికెళితే అక్కడ నిలదీస్తుండడంతో మన్మోహన్‌జీ బూట్లలో కాళ్లు పెట్టి... మౌన వ్రతం చేపట్టేశారు. సెలెక్టెడ్ ఆమ్నీషియా లాగా సెలెక్టెడ్ సైలెన్స్ పాటిస్తున్నారు. స్కాముల గురించిన ప్రస్తావన వచ్చిందో! ఠకీమని నోరు మూతపడిపోతుంది. మౌనం వీడండి మహాప్రభో అన్నా... మౌనం అర్ధాంగీకారం అనుకుంటామన్నా... నో...రు తెరిస్తే ఒట్టు. పెదాలకు ఫెవి క్విక్ పెట్టినట్టు మౌనంగా వుండాలని ఫిక్సయితే మాత్రం ప్రమాదమే. ఎందుకంటే అతి ఎప్పడూ అనర్ధదాయకమే. అది మౌనమే అయినా! ఎందుకంటే జనం ఓట్లతో గెల్చాక వారికి జవాబుదారీగా వుండాలి. సమధానం చెప్పి తీరాలి.

■

టపా

రాష్ట్రపతి రాజే

మనదేశంలో రాష్ట్రపతికి రాజాధిరాజులకు ఉన్న సుఖాలే వున్నాయి. ఢిల్లీలో రాష్ట్రపతి భవనం సౌకర్యాలు దేశంలో అందరికంటే ఎక్కువే. అంతేకాదు శీతాకాలంలో హైదరాబాద్ అలాగే సిమ్లాలో ఒకటి విడిది కోసం ఏర్పాటు చేయబడినాయి. కాని ఆయన విధులు ఎలా నిర్వహించిన అడిగే వారు లేరు. రాజ్యాంగంలోని 5,6 షెడ్యూలులో పేర్కొన్న గిరిజన ప్రాంతాలపై ఆయనకు పూర్తి హక్కులున్నాయి. 8 కోట్లు గిరిజనులను ఆయన కాపాడాలి. వారి జీవన నివాసాలకు రక్షణ సదుపాయాలు కలిపించాలి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ.

మాట బాగుంది

మనలో మాట బంగారం సింగారమే. బంగారానికి ఉన్న విలువ ముఖ్యంగా మన భారతదేశంలో స్త్రీలకు అందం. గౌరవం ఆడవారికి సింగారం. జలవైద్యుడు జలం లేకుండా వైద్యం జరగదు. ఏ వైద్యుడు ఏ రకమైన మందు ఇచ్చిన వాటికి నీరు చేర్చకుండా వాడకం జరగదు. మాటలు చెప్పే వారి కన్నా చేసి చూపించిన వారు గొప్పవారు. వారిని చూసి ప్రతి ఒక్కరు జలాన్ని రక్షించాలి. అలనాటి అందగాడు హరనాథ్ తక్కువ సినిమాలు చేసినా మంచి సినిమాలు చేశాడు. ఏ రంగంలోనైన మనుషులను కుంగదీయడానికి దుష్ప్రచారం చేస్తారు. వాటికి ఎదురు నిలిచినవారే ధీరులు. అసలు సమాజంలో అనాథలు అనే పదం లేకుండా చేయాలి. పిల్లల్ని బాధ్యతగా తీర్చిదిద్దలేని వారు బిడ్డలను కని అనాథలను చేయకూడదు. ఇటువంటి వారిని ప్రభుత్వం పరిగణలోకి తీసుకొని నేరస్తులుగా శిక్షించాలి.

బొడ్డేపల్లి కనకలక్ష్మి,పూజారిపేట,ఆముదాల వలస.

అలనాటి అందగాడు

అలనాటి అందగాడు వ్యాసం బాగుంది. అందానికి ప్రతిరూపం, ఉత్తమ నటనకు దర్పణం, ఇలాంటి వ్యాసాలు మరిన్ని ఇవ్వాలని కోరుకుంటున్నాం.

హేమ ప్రభాకర్, మార్కాపురం, ప్రకాశం జిల్లా.

జల వైద్యుడు

రాజస్థాన్ అంటేనే మనకు గుర్తుకు వచ్చేది ఎడారి ప్రాంతం. ఆ ప్రాంతంలో ఒక చుక్క నీరు దొరకాలంటే కొన్ని వేల మైళ్ల దూరం వెళ్ళాలి. అక్కడ ఉండే నదులు ఎండిపోవడం వల్ల ఈ సమస్య అధికమైనది. రాజేందర్ సింగ్ అనే వ్యక్తి నదులను సంరక్షించడం కోసం తన వృత్తిని పక్కన పెట్టడం నిజంగా గర్వించదగ్గ విషయం. మన పాలకులు కూడా ఆ వైద్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి.

వెంకట్, హైదరాబాద్.

జంతు ప్రేమికుడు

జోజోయిాల కథ చాలా బాగుంది. జంతువులు తమ తల్లి ప్రేమ కోసం పరితపించిపోతాయి అని చెప్పడానికి ఈ కథను ఉదాహరణగా చెప్పవచ్చు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన వాటిని కనీసం అటవీ సిబ్బందికైనా తెలిపితే బావుండు. ఈవారం నవ్వుల్ పువ్వుల్ చాలా బాగున్నాయి.

స్వాతి, కడప (ఈ మెయిల్)

అన్నాళ్లు వానేనా!

ప్రకృతిని ఎవరూ శాసించలేరు. సంవత్సరంలో ఆరు నెలలు వర్షం పడడం నిజంగా అద్భుతమే. కాని అక్కడ నివసించే వారికి మాత్రమే అది ప్రమాదంగానే ఉంటుంది. అక్కడి అందాలు మరెక్కడా చూడలేం.

సోము, రాజంపేట.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజమాబాద్, హైదరాబాద్-500020.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

జన గోదావరి

కవర్ స్టోరీ ———— 14

నది అంటే ప్రవహించునది అని అర్థం. ప్రవాహం అంటేనే చైతన్యానికి సంకేతం. నది పుట్టినది మొదలు- సముద్రంలో సంగమించేదాకా నడయాడిన నేలల్లా పచ్చదనం. ఆ జలసిరిని పొందికగా పొదువుకుంటే ఆ దారంతా ఒక పూలవనం. అందుకనే గోదావరి జన గోదావరిగా పరిమళిస్తోంది. ప్రయోజన గోదావరిగా కోట్లాదిమందిలో ప్రవహిస్తోంది. మేలు చేసే నేలకు, నీరుకు, నిప్పుకు, నింగికి, ప్రాణప్రదమైన గాలికి ప్రణమిల్లడం అనాది నుంచి మనిషి ఆనవాయితీ! చేతులెత్తి నమస్కరించటం సంస్కారం! గోదావరి నదీ పుష్కర ప్రాభవానికి ఈ కృతజ్ఞతే మూల కారణం.

ప్రత్యేకం 3
గుహల్లో అడవి!
చూద్దామా 4
కొండల్లో కొత్త లంక
నవ్వుల్ పువ్వుల్ 5
సినిమా కబుర్లు 6
తెలుగు తెరపై సొగ్గాడి సంతకం
వింత లోకం 8
కాలేజే !
కవిత్వం 9
ముసురులో కన్నీటి గానం
విభిన్నం 10
ప్రపంచమంతా అతనిదే !
టెక్ గురూ 11
స్పీడు నిర్మాణాలు
కథ 18
మూడు గుర్రాలు... మూడు అయిదులు
బాలనేస్తాలు 22
పిగ్మీ ఏనుగు
కొత్త పుస్తకాలు 24
అలనాటి రష్యన్ కథలు

తుపాకీ శాంతి గీతం - 13
ఏదో ఒక రోజు...
తన తండ్రి రేపిస్ట్ అని చెప్తా -12

గుహాలో అడవి!

ఆ గుహలోని ఓ చోట రెండు బోయింగ్ విమానాల్ని దాచేయొచ్చు. ఎంపైర్ స్టేట్ బిల్డింగ్‌ను కట్టేయొచ్చు. ఓ మహా నగరంలోని ఓ భాగం చక్కగా సరిపోతుంది. అది ఎంత విశాలమైందంటే ఆ గుహలో 40 ఆకాశ హర్మ్యాలను నిర్మించొచ్చు. ప్రపంచంలోనే అతి భారీ గుహగా గుర్తింపబడిన సన్ డూంగ్‌లో ఓ చిట్టడవే ఉంది. జలపాతాలు, వాగులు వంకలతోపాటు ఓ అంతర్వాహిని ప్రవహిస్తోంది .

వియత్నాంలోనిక్వాంగ్ బిన్హ్ ప్రావిన్స్ సన్ ట్రాచ్ ప్రాంతంలో ఉంది సన్ డూంగ్ గుహ. ఫాంగ్‌న్హాకే బాంగ్ జాతీయ వనంలో వెదరు వృక్షావరణం మాటున బయటి ప్రపంచానికి తెలీకుండా ఉంది. 1991లో స్థానికుడు హో ఖాన్హ్ దీన్ని మొదటి సారిగా కనుగొన్నాడు. వియత్నాంలో గుహలు ఎక్కువ. అక్కడ యుద్ధ సమయాల్లో స్థానికులు వీటిల్లోనే తలదాచుకునేవారు. హో ఖాన్హ్ తండ్రి యుద్ధంలో హతుడవ్వడంతో భయపడిపోయిన హో ఇక్కడకు చేరుకున్నాడు. అప్పటి వరకు ఆ ప్రాంతానికి రావడానికి స్థానికులు భయపడేవారు. 80 మీటర్ల వాలున పొగమంచుతో కూడిన ఆ గుహ ముఖద్వారం నుంచి భారీ హోరు గాలులు, శబ్దం రావడంతో ఎవ్వరు దానిలోకి ప్రవేశించడానికి సాహసించలేదు. హో దీనిలోకి వెళ్లినా ఎప్పుడు విననంత భారీగా, కళ్లను కుట్టేంత చీకటిగా ఉన్న ఆ గుహ గురించి బయటకు పొక్కలేదు. ఆ గుహకు చేరుకునే మార్గమూ మరచిపోయాడు. చివరకు విషయం బయటకు చెప్పడంతో బ్రిటిష్ గుహ పరిశోధకుడు హోవర్డ్ సిన్‌బ్రెక్ తన బృందంతో అక్కడ వాలి పోయాడు.అనేక ప్రయాసల కోర్చి నెలల తరబడి శోధించగా ఎట్టకేలకు 2009లో హో ఖాన్హ్ దానికి వెళ్లే మార్గాన్ని గుర్తు పట్టగలిగాడు. హోవార్డ్ బృందం ఆ గుహలోనికి ప్రవేశించి ప్రపంచానికి దాని మనుగడను చాటింది. నెలల తరబడి సాగిన మూడు అన్వేషణ యాత్రల ద్వారా గుహ లోపలి భాగాల్ని కొంత మేర పరిశోధించగలిగారు.ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు, విశేషాలు హోవర్డ్ బృందాన్ని నిద్రపోనివ్వలేదు. వారు మరింత ముందుకు వెళ్లేలా లాక్కుంది. ఇప్పటికీ ఆ గుహ అంతు బట్టలేదు. ఇన్నాళ్ల పరిశోధనలో చాలా అంశాల్ని వెలికితీశారు.

ఈ గుహ సుమారు 20 నుంచి 50 లక్షల ఏళ్ల పురాతనమైంది. 200 అడుగుల ఎత్తైన కాల్సైట్ గోడ ఈ గుహకు అడ్డుగా నిలిచి ఉంది. దీనికి 'గ్రేట్ వాల్ ఆఫ్ వియత్నాం' గా పేరుపెట్టారు. ఇది బురదమయం. ఈ గోడ పాదప్రాంతం 40 అడుగుల మేర బురదతో నిండి ఉంటుంది. ఈ గుహ అన్వేషణలో ఇదే ప్రధాన అడ్డంకి. హోవర్డ్ బృందం ఉత్సాహాన్ని నీరుగార్చిందిదే. చాలా రోజుల పాటు దీన్ని అధిరోహించడానికే కేటాయించారు. కేవలం ముగ్గురు కేవర్స్‌ను మాత్రమే ముందుగా పంపి ఆనుపానులు తెలుసుకున్నారు. ఈ ప్రమాదకరమైన లక్ష్యాన్ని దాటింది హోవర్డ్ క్లార్కే, గారెత్ స్వీనీ సివెల్, మార్క్ జెన్కిన్స్. వారు దాన్ని అధిరోహించినపుడు ఎంతో ఉద్విగ్నతకు లోనయ్యారు. అది ఎంత అతిశయంగా ఉందంటే దాని వెనుక ఉన్న అటవీ ప్రాంతం కనిపించడంతో అక్కడ డైనోసార్లు ఉండొచ్చనేంతగా. 'లాస్ట్ వరల్డ్' పుస్తకంలో పేర్కొన్న ప్రాంతమిదేనేమో అని కూడా అనుకున్నారట. కొంత దూరం చిమ్మచీకటిగా ఉన్నా ఆ తర్వాత ఓ చిట్టడవి కనిపించింది వారికి. 400 మీటర్ల వైశాల్యమున్న పై భాగం కూలిపోవడంతో అక్కడకు సూర్యరశ్మి, వర్షం ప్రవేశించి దట్టమైన అడవి ఏర్పడింది. చెట్లు అంటే చిన్నచిన్నవి కాదు ఏకంగా వంద మీటర్ల ఎత్తున్న భారీ వృక్షాలు కూడా ఉన్నాయి అక్కడ. ఏ గుహలో చూడనటువంటి పెద్ద కేవ్ పెరల్స్ బాస్కెట్ బాల్ అంత పరిమాణంలో దొరికాయి. నీరు పైనుంచి చుక్కలుగా పడి కాల్సైట్ ద్వారా తయారై ఇవి ముత్యాలను పోలి ఉంటాయి. అక్కడి జలాశయాల్లో శ్వేత మీనాలు కనిపించాయి. స్టాల్సైట్ గుహలతో కూడిన ఇక్కడ సుమారు 150 వరకు గుహల నెట్‌వర్క్ ఉంది. ఇంకా చాలా భాగాన్ని శోధించాల్సి ఉంది. 1400 అడుగుల ఎత్తులో దీని దక్షిణ ముఖ ద్వారం ఉంటుంది. 200 అడుగుల విశాలంగా ఉండే ఈ గుహావరణం మొత్తం 130 కోట్ల ఘనపు అడుగుల స్థలం కలిగి ఉంది. ఒక్కో బ్లాక్ 6 నుంచి 9 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. రావో తువాంగ్ నది ప్రవాహమే ఈ గుహ ఏర్పడటానికి కారణమని గుర్తించారు. పర్వత నదీ గుహగా దీని పేరు కూడా అదే అర్థానిస్తుంది. ఇప్పటికీ రావో తువాంగ్ నది దీనిలో అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. వందల అడుగుల ఎత్తునుంచి జాలువారే జలపాతాలున్నాయి. టురాంగ్ సన్ జాతీయ రహదారి నుంచి పది కిలోమీటర్ల అటవీ మార్గంలో 6 గంటల ట్రెక్‌తో సన్ డూంగ్ ముఖద్వారానికి చేరుకోవచ్చు. పర్యాటకులకు అనుమతి ఉంది. ప్రత్యేక ఏర్పాట్లతో ఇక్కడ కొన్నిరోజుల పాటు గడపొచ్చు.



హిందూ సముద్రంలో ముత్యం శ్రీలంక. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తులో మరో శ్రీలంక కనిపిస్తుంది. తేయాకు తోటలతో, ప్యాలెస్‌లను పోలిన కట్టడాలతో బ్రిటీష్ కాలనీల వారసత్వానికి సింబాలిక్‌గా కనిపిస్తుంది. తేయాకు తోటల చుట్టుతా మెలికలు తిరుగుతూ సాగే దారుల్లో ప్రయాణం చేయిస్తూ ఊయలలూపుతుంది. కొండ కోనల్లో దాగుడు మూత లాడే ఆ ప్రదేశాల్లో విహారం దక్షిణ లంకను పరిచయం చేస్తుంది.

కొండల్లో కొత్త లంక

దక్షిణ శ్రీలంకకు చివరి తట్టు అయిన వెలిగామా సూర్యాస్తమయాన్ని కొత్తగా చూపిస్తుంది. కనుచూపు మేర సముద్రమంతా చిక్కటి నారింజ రంగులో కదలాడుతుంటే విశ్వం రంగు అదేనేమో అనిపిస్తుంది. ఇక్కడి టెర్రకోట శైలి పెంకుటిళ్లు ప్రత్యేకం. సారంగులనే మత్స్యకారులు చెక్క ఇళ్లు కూడా చూడముచ్చటగా ఉంటాయి. పురాతన కాలం నాటి రాతి దేవాలయాలు, ఏనుగుల గుంపులతో కిక్కిరిసిన అడవులకు పేరిది. కొగ్గల సరస్సు, ఉడా వలావే, యాలా జాతీయ పార్కులు తప్పక చూడాల్సినవి. ఇక్కడి సముద్ర నీటి కింద విరిగిన నౌకల అవశేషాల్ని చూడొచ్చు. భారీ తిమింగలాల్ని చూడాలనుకునే ఆశను ఇక్కడి బీచులు తీర్చేస్తాయి. వంపులు తిరిగి ఉండే ఈ ప్రాంతం నుంచే తేయాకు తోటలు ఆరంభమవుతాయి. ఇక్కడే 400 ఏళ్లనాటి డచ్ గాలే కోట ఉంది. దీన్ని యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించింది. బ్రిటీష్‌వారు ఏర్పాటు చేసిన డోండ్రా లైట్‌హౌజ్ పోస్ట్ కార్డు ఫొటోగ్రాఫ్ పరిసరాల్ని కలిగి ఉంటుంది. పోలాగా పిలువబడే ఇక్కడి మార్కెట్‌లలో శ్రీలంక సినమాన్ (దాల్చిన చెక్క) విరివిగా దొరుకుతుంది. ఇదో బ్రాండ్ కూడా. అక్కడి నుంచి కాండీలోకి దారి పడితే అదే ఓ ప్రత్యేక రాజ్యంగా తోస్తుంది.

ఐ క్యాండీ..

ఈ దీవి మధ్య భాగాన్నంతట విస్తరించిన కాండీ బౌద్ధ రాజ్యంగా విరాజిల్లింది. పచ్చగా, చల్లగా, ఎత్తైన ప్రదేశంలో ఉండే ఈ ప్రాంతం ఉష్ణమండల ప్రాంతమంటే నమ్మశక్యం కాదు. నడుం ఎత్తు వరకు చక్కగా ట్రిమ్ చేసిన తేయాకు తోటల గుండా సాగే ప్రయాణాలు మరిచిపోలేని అనుభూతిని కల్పిస్తాయి. స్ట్రాత్‌డన్, షానన్, కెనిల్‌వర్త్‌గా పిలిచే ఇక్కడి తేయాకు ప్లాంటేషన్లు బ్రిటీష్ వారి ముద్రను చెబుతాయి. ఆ ప్లాంటేషన్లలో పనిచేసేందుకు భారత్ నుంచి తమిళులు తరలి వెళ్లారు. ఈ కొండల గుండా వెళ్లే రైలు ప్రయాణం నిదానంగా సాగినా అక్కడిప్రకృతి సౌందర్యంతో కట్టిపడేస్తుంది. ప్రయాణం ముగియకూడదనే ఆలోచనను తెస్తుంది. రెండు లైన్ల రహదారులే అయినా చాలా పటిష్టంగా, భద్రంగా ఉంటాయి. రాజధాని కొలంబో నుంచి 3 గంటల దూరంలో ఉండే కాండీకి పర్యాటకులను తీసుకొచ్చే టూరిస్ట్ డ్రైవర్లకు స్థానిక విడిది ఉచితంగానో, చవకగానో లభిస్తుంది. పర్యాటక కేంద్రంగా ఎంతగా అభివృద్ధి చెందిందో ఈ విషయం తెలియజేస్తుంది. ఒకప్పుడు చిన్న గ్రామంగా ఉన్న కాండీ పట్టణం లోయ ప్రాంతంలో ఉంటుంది.

బుద్ధుని దంతం..

ఇక్కడి బుద్ధుడి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. బుద్ధుడి నిర్యాణానంతరం భారత్ అంతటా ఆయన దంతాన్ని ఒక దాన్ని యాత్ర చేసి చివరకు 16వ శతాబ్దిలో ఇక్కడకు చేర్చారు. దాన్ని ఓ బంగారు పెట్టెలో భద్రపరిచి రెండు ఆలయ నిర్మాణాలతో పాలరాతి క్షేత్రం నిర్మించారు. వేయిన్నర ఏళ్లపాటు సాగిన ఆ దంత యాత్రను వివరించే చిత్తరువులు మందిరంలో చిత్రించారు. అప్పటి రాజరికాని పట్టిచూపే ఆభరణాలు, గ్రంథాలు, అక్కడ ప్రత్యేకంగా లభ్యమయ్యే సుగంధాలతో మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. సారంగ్ అనే ప్రత్యేక వస్త్రాన్ని ధరించి బుద్ధ దర్శనం చేసుకోవడం ఆనవాయితీ. కాండీకే ప్రత్యేకమైన నృత్యరీతి ఉంది. అగ్నితో విన్యాసాలు చేసే కళాకారులు అక్కడి కాండ్యన్ కళా, సాంస్కృతిక కేంద్రంలో ప్రదర్శనలు ఇస్తుంటారు.

ఆర్కిడ్ తోటలు..

కాండీ పట్టణానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉండే రాయల్ బొటానికల్ గార్డెన్స్ చాలా విలక్షణమైనది. ఆర్కిడ్‌లు, సుగంధ ద్రవ్య, ఓషధ మొక్కలతో 147 ఎకరాల్లో విస్తరించుకుని ఉంటుందిది. సుమారు 4000 జాతుల మొక్కల్ని పెంచుతున్నారు. 1371లో విక్రమబాహూ-2 అనే రాజు వీటికి అంకురార్పణ చేశాడు. ఆ తర్వాత బ్రిటీష్ హయాంలో మరింత అభివృద్ధి చేశారు. ఏటా 20 లక్షల మంది పర్యాటకులు ఈ గార్డెన్స్‌ను చూడటానికి వస్తారు. హెల్గాస్ ఫొల్లీ అనే హోటల్ జర్మనీకి చెందిన బాహాస్ కళను ఆలింగనం చేసుకుంది. పాత కాలం నాటి ఫర్నీచర్, ఆయిల్ పెయింటింగ్‌లతో వందేళ్ల వెనక్కు తీసుకెళుతుంది. మహాత్మ గాంధీ, వివియన్ లీ, లారెన్స్ ఒలివియా, జార్జ్ పెక్ వంటి ప్రసిద్ధ వ్యక్తులు ఇక్కడ బస చేశారు. వారి ఫొటోలు ఇక్కడ దర్శనమిస్తాయి.

తేయాకు లోకం..

కాండీ నుంచి 40 మైళ్ల దూరంలో హట్టన్ పట్టణం ఉంది. ఇది కూడా తేయాకు క్షేత్రాలకు సుప్రసిద్ధమైంది. 4000 వేల అడుగుల ఎత్తులో కొండలుంటాయి. జలపాతాలకు ఇవి నెలవులు. కాస్టెరిగా సరస్సును ఆనుకుని తేయాకు తోటలుంటాయి.ఎటు చూసినా అవే దర్శనమివ్వడంతో తేయాకు లోకంగా కనిపిస్తుంది. టియాన్‌ట్సిన్ బంగళా 1888 నాటిది. దీన్నిపుడు రిసార్ట్‌గా మార్చారు. ఇక్కడి నుంచి మూడున్నర గంటల ప్రయాణం చేస్తే ఎల్లాకు చేరుకోవచ్చు. మృదువుగా కనిపించే కొండల్లో కలప చెట్లు దట్టంగా పరుచుకున్న ఈ ప్రాంతంలో దేవన్ జలపాతం ఉంది. మహావేలి నదిలోని ఓ పాయ 97 మీటర్ల ఎత్తు నుంచి జాలువారుతుంది ఇక్కడ. దాని ధార ఒరవడితో నీరు పొగమంచులా మారి ఆ ప్రాంతాన పరుచుకుంటుంది. ఇక్కడి సమీపాన ఉన్న జార్జ్ సరస్సు నీరు మెరుస్తున్నట్టుగా ఉంటుంది. ఇది కూడా పర్యాటక కేంద్రమే. ఇక్కడి సీతా రామ మందిరం కూడా ప్రాచీనమైంది. చుట్టూ అరణ్య ప్రాంతంలో జాతీయ రహదారికి దగ్గరగా ఉండే ఈ గుడిని రామాయణ కాల సందర్శనీయ స్థలంగా గుర్తించారు. ఇక్కడ అనేక వసతి గృహాలు, రెస్టారెంట్లు పర్యాటకులతో కళకళలాడుతూ ఉంటాయి. దగ్గరలోని నువారా ఎలియాకు కూడా పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక్కడి కూరగాయల తోటలు పేరుగాంచినవి. కొండ కోనల్లో కొత్త లంకను దర్శిస్తే అసలైన ద్వీపలోకం కళ్లకు కడుతుంది.

నవ్వుల్ – పువ్వుల్

వయసు

'అబ్బ డాక్టర్ రావు నిజంగా ధన్వంతరే. మా ఆవిడ బద్ధకాన్ని, ఆయాసాన్ని ఒక్క దెబ్బకు పోగొట్టాడు' సంతోషంగా చెప్పాడు చిదంబరం.

'ఏం మందిచ్చాడేం?' కుతుహలంగా అడిగాడు ఏకాంబరం

'వయసు పెరుగుతున్నది కదా. అందుకే అలసట' అన్నాడు అంతే. మర్నాడు నుంచి నలుగురు చేస్తున్న పని చకచక చేస్తున్నది' చెప్పాడు చిదంబరం

వాషింగ్ మిషన్

రాము: నా భార్యకి వాషింగ్ మిషన్ కావాలట (బాధపడుతూ అన్నాడు)

సోము: అదృష్టవంతుడివి. మా ఇంట్లో వాషింగ్ మిషన్‌ని నేనే (వాపోయాడు)

సామెత

"ఆలస్యం అమృతం విషమంటే?"

"త్వరగా ప్రేమించు అని"

"మరి నిదానమే ప్రదానమంటే?"

"కాస్త ఆలోచించి పెళ్ళి చేసుకో అని"

టైమెంత

"సార్ టైమెంతయింది?" అడిగాడు సుధీర్

"తొమ్మిదీ పది" చెప్పాడు వాచ్చీ చూసి చెప్పాడు శంకర్

"కరెక్టుగా చెప్పండి?" సార్ మరీ గంట తేడాతో చెబుతారేం' విసుక్కున్నాడు సుధీర్.



కొత్త పార్టీ

గురు: కొత్త పార్టీ పెట్టాలంటే ఏం చేయాలి?

రాజు: ఇంకేముంది! ఉన్న పార్టీల నుంచి కొంతమంది నాయకులను బయటికి లాగితే సరిపోదా?

స్లిప్

టీచర్: క్వశ్చన్ పేపరు లీక్ అయినా కూడా స్లిప్‌లు ఎందుకు పెట్టావురా?

రాము: ఆకాశంలో చంద్రుడు ఉన్నాడని ఇంట్లో లైట్స్ ఆర్పేయము కదా టీచర్...

టీచర్: ఆ.....

సినిమా

టీచర్: ఏంట్రా గోపి! రొంపి, దగ్గు అని బడి ఎగ్గొట్టి సినిమాకి వెళ్ళావట?

గోపి: అవును టీచర్. సినిమా యాడ్స్‌లో ఏ మందు వేసుకోవాలో చూపిస్తారని.

అడ్రస్

ఒక పార్టీలో గోపాల్, ప్రకాష్ కలుసుకున్నారు. అందులో గోపాల్ వేసుకొచ్చిన డ్రస్ చూసి ప్రకాష్ నీ సూట్ చాలా బాగుంది. ఎక్కడ కుట్టించావు? అనడిగాడు

ఆ టైలర్ అడ్రస్ కావాలా? తప్పకుండా ఇస్తాను. కానీ నా అడ్రస్ ఆ టైలర్‌కి మాత్రం చెప్పొద్దు అన్నాడు గోపాల్

అంటే...నువ్వు ఆ డ్రస్‌ను.. .దొంగిలించి తెచ్చావా? అంటూ నోరు తెరిచేశాడు ప్రకాష్.



కొందరి జీవితం వడ్డించిన విస్తరి. మరికొందరి జీవితాలు భిన్నంగా వుంటాయి. అష్టకష్టాలు పడితే గాని ఆకలి తీరదు. ఇరవై నాలుగ్గంటలూ పని కోసం పరితపించి కష్టపడి పని చేస్తేనేగాని కుటు ంబాన్ని పోషించుకోవడం గగనమైపోతుంది. మద్రాసు పుర వీధుల్లో గ్రాడ్యుయేషను జేబులో పెట్టుకొని ఏఉద్యోగం చేయడానికి మనసు అంగీకరించక మనసు పడిన సినిమా అవకాశాలు చేతిక చిక్కకా చిక్కినా చేజారిపోతూ కంట తడి పెట్టించి...కఠినమైన క్రమ శిక్షణతో అకుంఠిత దీక్షతో అనితర సాధ్యమైన స్థాయిని చేరుకున్న వ్యక్తి తెలుగు సినీ పరిశ్రమలో ఎవరైనా వున్నారంటే అతను శోభన్ బాబే.

తెలుగు తెరపై సోగ్గాడి సంతకం

మైలవరం కుంటు ముక్కలలో ప్రాథమిక విద్య అభ్యసించి విజయవాడ ఆంధ్రా క్రిష్టియన్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేసి (విజయవాడ) మద్రాసు 'లా' చదివేందుకు పయనమైన ఉప్పు శోభనా చలపతిరావుకి చదువు మీద మనసు పోక తొలి సంవత్సరంలోనే పుస్త కాలను అటకెక్కించి వేషాల వేటలో పడ్డాడు. 'దైవబలం' చిత్రంలో నట జీవితాన్ని ఆరంభించిన శోభన్‌కి అవకాశాలు అంతగా రాలేదు. తొలి రోజుల్లో వేషాల వేటలో అగ్ర నటుడు ఎన్.టి.రామారావుని కలవడం జరిగింది. శోభన్‌బాబు ఆర్థిక ఇబ్బందుల్ని తెలుసుకున్న ఎన్.టి.ఆర్ 'సీతారామ కల్యాణం' చిత్రంలో లక్ష్మణుడి పాత్రతో ప్రోత్సహించాడు. తర్వాత ఎన్.టి.ఆర్ 'భీష్మ, మహామంత్రి తిమ్మరుసు, ఇరుగు పొరుగు, లవకుశ, నర్తనశాల, మంచి చెడు' చిత్రాల్లో సహచర పాత్రల్నిచ్చి నటుడిగా నిలదొక్కుకునేందుకు సహకరించాడు.

అయితే ఎన్టీఆర్ 'వీరాభిమన్యు' చిత్రం విక్టరీ దర్శకత్వంలో నటిస్తున్న సమయంలో అభిమన్యుడిగా ఎవరు బావుంటారన్న చర్చ వచ్చినప్పుడు విక్టరీ మధుసూదనరావుతో శోభన్ బాబుని నటించమని సలహా ఇచ్చారు ఎన్టీఆర్. శోభన్‌బాబు ప్రవర్తన, వినయ విధేయతలూ, క్రమశిక్షణ అమితంగా ఆకర్షించాయి విక్టరీని. 'నువ్వే నా హీరో. ఈ సినిమాలోనే కాదు. తదుపరి సినిమాల్లోనూ నిన్ను హీరోగా నిలబెడతాను' అని నిర్ణంచుకున్నాడు. పట్టుదలగా వీరాభిమన్యు చిత్రాన్ని రూపుదిద్దాడు మధుసూదనరావు.

మధుసూదనరావుకి దుర్వాస మహాముని అని పేరు. కోపం వస్తే సెట్‌లో ఆడా, మగా అని చూడకుండా తిట్టడం, కొట్టడం చేసేవాడు. శోభన్ ఇందుకు మినహాయింపు కాదు. ఇంకా ఎక్కువ బాధలు పడ్డాడు. ఎన్ని తిట్లు తిట్టినా పల్లెత్తు మాట అనని శోభన్‌బాబు మీద విక్టరీ ప్రత్యేకమైన ప్రేమని పెంచుకున్నాడు. తన మానస పుత్రుడిగా చూసుకున్నాడు.

అన్నపూర్ణ సంస్థలో 'చదువుకున్న అమ్మాయిలు' చిత్రంలో సావిత్రి సరసన కథానాయకుడిగా నటించినా ఆ చిత్రం పరాజయం పొందడంతో శోభన్‌కి ఫలితం దక్కలేదు. అక్కినేని కాంబినేషన్‌లో సుమంగళి చిత్రంలో అతిథి పాత్రలో నటించాడు శోభన్‌బాబు. వీరాభిమన్యు అయితే కె.యస్.ఆర్.దాసు దర్శకత్వంలో వచ్చిన లోగుట్టు పెరుమాళ్ళు కెరుక. విజయవంతమైన చిత్రంగా పేరు సంపాదించింది. పొట్టి ప్లీడరు చిత్రంలో కూడా మంచి మార్కులే సంపాదించాడు. ప్రత్యేకించి చెప్పుకోవలసిన చిత్రం 'గూఢచారి 116'. ఈ చిత్రంలో కాస్సేపు కనిపించినా శోభన్‌బాబుకి చాలా మంచి పేరు వచ్చింది. అలాగే 'పుణ్యవతి' చిత్రం కూడా. తాగుబోతు పాత్రలో అద్భుతంగా చేశాడు. ఆ రోజుల్లో అన్నా చెల్లెళ్ళు సెంటిమెంటు చిత్రం ఆడపడుచు. 'రక్త సంబంధం' తర్వాత మళ్ళీ అంత గొప్ప చిత్రంగా ఈ చిత్రాన్ని చెప్పుకోవచ్చు. ఎన్టీఆర్, శోభన్‌బాబు చంద్రకళ (న్యూ ఫేమ్) ఈ సినిమాలో ఎన్టీఆర్, శోభన్‌బాబుకి సమానంగా పేరొచ్చింది. భార్య పోరు భరించలేక చెల్లికి దూరమైన పాత్రలో శోభన్ జీవించాడనే చెప్పాలి. 'మళయాలం' తులాభారం చిత్రం

తెలుగులో రీమేక్ చేశారు విక్టరీ. ఇందులో శారద కథానాయిక. ఈమె సరసన కార్మికుడి పాత్రలో శోభన్ నటించాడు. ఆ చిత్రం సిల్వర్ జూబ్లి జరుపుకుంది. చూసేవారికి శారద పాత్రతో పాటు శోభన్‌బాబు పాత్ర కూడా నిలిచిపోతుంది. శోభన్ బాబు నట జీవితంలో మలుపు తిప్పిన మేలి చిత్రాలుగా మానవుడు–దానవుడు, పసిడి మనసులు, విచిత్ర దాంపత్యం చెప్పుకోవచ్చు. ఈ మూడు చిత్రాలు ఉష శ్రీ ప్రొడక్షన్ చిత్రాలు. మూడు చిత్రాలు కథా బలం వున్న చిత్రాలు. బాక్సాఫీసు దగ్గర శోభన్ సత్తా చాటిన చిత్రాలుగా చెప్పుకోవచ్చు.

ఆ రోజుల్లో క్లాస్ ప్రేక్షకులకు దగ్గరయిన చిత్రంగా 'కల్యాణ మంటపం' చిత్రం చెప్పుకోవచ్చు. శోభన్, కాంచన హీరో హీరోయిన్లు వీరాభిమన్యు చిత్రం తర్వాత హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం. వేశ్యల జీవితం ఇతివృత్తంగా చెక్కిన మెలోడి డ్రామాతో ఆదినారాయణరావు సంగీతంలో రసజ్ఞుల్ని మెప్పించిన చిత్రం కల్యాణ మండపం.

మొట్ట మొదటిసారిగా విజయ యాత్రకి వచ్చినప్పుడు ఆంధ్ర దేశంలో మహిళలు శోభన్ బాబుకి మంగళహారతులు పలికారు. 1971 లో విడుదలైన 'తాసీల్దారుగారి అమ్మాయి' కె.యస్. ప్రకాశరావు (రాఘవేంద్ర రావు తండ్రి) దర్శకత్వంలో జమున, చంద్రకళ సరసన ద్విపాత్రాభినయం చేశాడు శోభన్. ఈ చిత్రం సిల్వర్ జూబ్లీ చేసుకుంది. శతదినోత్సవం సందర్భంగా అక్కినేని మాట్లాడుతూ 'శోభన్ ఈజ్ ది హోప్ ఆఫ్ ద ఇండస్ట్రీ' అన్న కితాబు ఇచ్చాడు. అంతే ఇక వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం రాలేదు. చెల్లెలి కాపురం, శారద, జీవితం' ... ఒకటా రెండా ఎన్నో విజయవంతమైన చిత్రాలు చేశాడు.

బుద్ధిమంతుడు చిత్రంలో బాపురమణ శోభన్‌తో కృష్ణుడి పాత్రని ఎక్స్‌పరిమెంట్ చేశారు. గొప్పగా పండింది. ఆ స్ఫూర్తితో సంపూర్ణ రామాయణం చిత్రం చేశారు. ఇక శోభన్

రామానాయుడు ,కృష్ణతో...

సాంఘిక చిత్రాలు ముఖ్యంగా ఇద్దరూ కథానాయికలు ఉన్న చిత్రాలకు పెట్టింది పేరుగా నిలిచాడు. మహిళలు శోభన్ ఇద్దరు హీరోయిన్లతో నటిస్తున్నా ఆదరించారు. శోభన్‌బాబు సినిమాలకు తొంభై శాతం మహిళ ప్రేక్షకులే అంటే అతిశయోక్తి కాదు. జీవన తరంగాలు, సొగ్గాడు, జీవన జ్యోతి , మల్లెపూవు, కార్తీక దీపం, స్వయం వరం, దీపారాధన, మహారాజు, ఇల్లాలు–ప్రియురాలు, శ్రావణ సంధ్య, దేవాలయం లాంటి ఎన్నో చిత్రాలు శోభన్‌బాబు నటనకి ప్రతిరూపాలుగా నిలిచాయి.

'జేబు దొంగ' సినిమా చేస్తున్నప్పుడు విక్టరీతో "గురువు గారు! మీరు రెమ్యూనిరేషన్ ఇవ్వకపోయిన పరవాలేదు. తిట్టకండి. ఇది కండీషను' అన్నాడు. అలాగే అని ఒప్పుకున్నాడు విక్టరీ (రెమ్యూనిరేషన్ ఇచ్చారనుకోండి). ఇక శోభన్‌బాబు వ్యక్తిగత జీవితానికొస్తే 1976 లోనే భూమి విలువ తెలుసుకున్న వ్యక్తి. అందుకే భూదేవిని నమ్ముకున్నాడు. వ్యసనాలకు దూరం. తగాదాలకు దూరం. చెడు మనుషులకి దూరం. ఆదివారాలు షూటింగు లేదు. శాంతి –ప్రశాంతి, ఇల్లాలు శాంతకుమారి, పిల్లలు కరుణా శేషు, మృదుల ప్రశాంతి, నివేదిత ఇదే ప్రపంచం. మదర్ థెరిస్సా అంటే ప్రాణం. ఆమె నిర్యాణం చెందినపుడు అక్కడే గడిపాడు. శోభన్ మంచిని పెంచాడు. పంచాడు. ఎన్నో గుప్త దానాలు చేశాడు. తనను నమ్ముకున్న వారిని ఆదుకున్నాడు. అందలం ఎక్కించాడు. శోభన్ బాబు సినీ జీవితంలోనే కాదు. నట జీవితంలోనూ హీరోగా నిలిచాడు. తను ఎవరి రుణం వుంచుకోలేదు. ఎంతో మంది ఆయన శ్రేయోభిలాషుల్ని ఏదో ఒక విధంగా రుణగ్రస్తుల్ని చేసి వెళ్ళిపోయాడు.

-ఇమంది రామారావు,
9010133844

వింత లోకం

డబ్బా గిటారేం కాదు

పాత రేకు డబ్బాని కింద పడేస్తేనే చాలు! బోలెడు గోల చేస్తుంది. ఇక దాన్నుంచి వినసొంపైన సంగీతాన్ని ఆశించడం పిచ్చి పనే అనిపిస్తుంది. మహా అయితే రెండు మూడు తబలా దెబ్బలు కొట్టి ఊరుకోవచ్చేమో అనుకుంటారు గానీ ఆ రేకు డబ్బానే గిటార్ చేసి వినసొంపుగా వాయించేస్తున్నాడు వెస్సె ఫ్రీమన్. లైబీరియాకు చెందిన ఫ్రీమన్ డబ్బా గిటార్ ఇప్పుడు యూట్యూబ్ సంగీత శ్రోతలను ఉర్రూతలూగిస్తోంది. అంధుడైన ఫ్రీమన్‌కు సంగీతమంటే పిచ్చి. గిటార్ అంటే మరీను. 'మ్యూజిక్ సీడీకే డబ్బు లేని అతడికి గిటార్ పట్టుకునేంత స్థోమత ఎక్కడది?' అంటూ ఆటపట్టించేవాళ్లు ఆశ్చర్యపోయేలా డబ్బానే గిటార్ చేసేశాడు. దాన్నుంచి రెగ్గె సంగీతాన్ని వినిపిస్తూ ఆశ్చర్యపరిచాడు. మన భారత సంతతి వాళ్లైన నిఖిల్, సచిన్ రామచంద్రాని సోదరులు ఆ మ్యూజిక్‌ను విని ఫ్రీమన్‌కు అభిమానులైపోయారు. వారి ఆహార సంస్థ 'ఓ!'కి జింగిల్ పాడమని కోరారు. దాన్ని యూట్యూబ్‌లో పెట్టేసరికి ఫ్రీమన్ గొప్పదనం ప్రపంచానికి పాకిపోయింది. చాలామంది అభిమానులు తయారయ్యారు. ఓ అమెరికా అభిమాని ఒవేషన్ శైలి గిటార్‌ను బహుమతిగా పంపాడు. ఇప్పుడు ఫ్రీమన్ పేరిట యూట్యూబ్‌లో ఓ చానెల్ విజయవంతంగా నడుస్తోంది. చేతికి మంచి గిటార్ అందినా తను అభిమానించేది మాత్రం స్వయంగా చేసుకున్న రేకు డబ్బా గిటార్‌నే. సాధారణ గిటార్‌కు ఏ మాత్రం తీసిపోకుండా దాన్నుంచి స్వరాలను సృష్టించే ఫ్రీమన్ పాటను విని తీరాల్సిందేనని ఆన్‌లైన్ మిత్రులను పట్టుబడుతున్నారు అభిమానులు.

కాలేజే!

ఆ కళాశాల వందేళ్లనాటిది. ఏటా 12 మందికే అక్కడ చదివే అవకాశం. హార్వార్డ్ విశ్వవిద్యాలయం కన్నా మెరుగైనదని దాని విద్యార్థులు ఆకాశానికెత్తేసే ఆ కళాశాలే డీప్ స్ప్రింగ్స్ కాలేజీ. సియెర్రా నెవడా ప్రాంతంలో ఇన్యో-వైట్ పర్వతాల మధ్యన మారుమూలన ఉండే అదసలు కాలేజనే విషయం దగ్గరి ప్రాంతాల వారికి కూడా తెలియదు. దాన్నేదో మతపరమైన సంస్థగానో, లేదా మానసిక కేంద్రంగానో అనుకుంటారు. ఈ కాలేజీలో చదువు చెప్పే తీరు కూడా వింతంగా ఉంటుంది. కేవలం మగపిల్లలకే అక్కడ విద్యాబుద్ధులు అందుతాయి. పూర్తిగా విద్యార్థులతోనే కార్యకలాపాలు సాగిస్తారు. ఇక్కడ చదువు కన్నా ఒళ్లొంచి కష్టించడానికే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. పొలం పనుల దగ్గర నుంచి గోశాలల వరకు విద్యార్థులు పాలు పంచుకోవాల్సిందే. ఎడారి ప్రాంతమైన అక్కడ వాతావరణానికి అలవాటు పడుతూ శ్రమ జీవనాన్ని గడపాలి. ఎల్.ఎల్.నున్ అనే పారిశ్రామికవేత్త దీన్ని పవర్‌ప్లాంట్ నిర్మాణ వర్కర్ల కోసం రూపొందించాడట. శారీరక శ్రమ, సమిష్టి కృషి ద్వారానే చక్కగా పాఠాలు నేర్చుకోగలరని ఆయన విశ్వాసం. ఇక్కడి నియమాలు కూడా కఠినంగా ఉంటాయి. రెండేళ్ల పాటు సాగే చదువు పూర్తయ్యే వరకు అనుమతి లేనిదే విద్యార్థులు బయటకు వెళ్లడానికి వీలు లేదు. సందర్శకులకు అనుమతి లేదు. ఫైర్ ఫైటింగ్ నుంచి ఆవుల మందలను చూసుకునే వరకు అన్ని బాధ్యతలను విద్యార్థులకే అప్పగిస్తారు. ఇక్కడ కౌబాయ్ అవడం గౌరవంగా భావిస్తారు. వీళ్ల బాధ్యతల పేర్ల నుంచి పాఠ్యాంశాల పేర్ల వరకు విచిత్రంగా ఉంటాయి. ఏదో ఆషామాషీ చదువులు కొనసాగవు. ఫిలాసఫీ వీళ్లు 'గాడ్ అండ్ ఈవిల్– థియోడైసీస్' అని, లిటరేచర్‌ను 'కాచింగ్ స్పైస్' పేరిట చదువుతారు. 'బూజీస్' పేరిట ఎడారి నృత్యం చేసే వీళ్లను చూసే ఇది కాలేజీ కాదని భ్రమపడుతుంటారు స్థానికులు. ఆ మధ్య ఓ అమ్మాయిని చేర్చుకునేందుకు అంగీకరించినా పూర్వ విద్యార్థి గొడవతో వెనక్కు తగ్గారు కూడా.



సీసాలతో ఆఫీస్

బీర్లను ఖాళీ చేయడంలో కాదు.. ఆ ఖాళీ సీసాలను కళాత్మకంగా మార్చడంలోనే ఉంది అసలు కిక్కు అంటున్నాడు చైనా ఆర్కిటెక్ట్ లీ రాంగ్జన్. బీరు సీసాలతో ఓ పై ఫ్లోర్ కట్టుకుని ఆఫీసు పెట్టేసుకున్నాడు. తనెంత గొప్ప ఆర్కిటెక్టో కస్టమర్లకు అర్థం కావాలంటే మాటలతో కాదు పనితనంతో ఆకట్టుకోవాలనుకుని ఇలా కట్టేశాడు. దీనికి ఏడెనిమిది లక్షల వరకు ఖర్చు అయిందట. 8500 బీరు సీసాలను 40 వరసల్లో పేర్చి సిమెంట్, గులకరాళ్లతో చూడచక్కగా అంతస్తు నిర్మించాడు. 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ నిర్మాణం చాంగ్‌క్వింగ్ నగరంలో ఉంది. నాలుగు నెలలు కష్టపడి తన తండ్రి సాయం చేయగా పూర్తి చేసిన ఈ ప్రాజెక్టుతో లీ పేరు అతను ఊహించినట్టే వార్తల్లోకి ఎక్కేసింది. ఇన్నర్ మంగోలియా విశ్వవిద్యాలయంలో చదివిన లీకి చాలా కంపెనీల్లో అవకాశాలు వచ్చాయి. కానీ, తన కళకు, అభిరుచికి ప్రాధాన్యం ఇవ్వని ఆ సంస్థలకు బైబై చెప్పి సొంతగా బిజినెస్ పెట్టుకున్నాడు.

కవిత్వం

ముసురులో కన్నీటి గానం

చినుకులు నేలపై పడ్డప్పుడు
నేల పులకరించిపోతోంది.
నీటి బొట్టుల సందుల్లోనుంచి
ఓ పిట్ట కూతలు
సముద్రం వేడి చల్లబడి
అలకి అలకి ఓ జీవన గీతం
బెస్త కన్య మట్టెల చప్పుడుకు
ఇసుక తిన్నెల్లో కాలిముద్రలు
ఆ గుడిసె అరవై ఏళ్ళుగా తడుస్తూనే
వుంది.
ఆ ముదుసలికి ఎనిమిది పదులు
నిండాయి
ఎన్నో తుఫాన్లు ఆమె చూచిందో...
మనుమరాలికి చెప్పిన కథల్లో
ఎందరో రాజులు కూలిపోతుంటారు.
ఆత్మస్థైర్యం ఒక్కటె ఆడెసెకు ఆయువు
పెద్ద కొడుకు వేటకెళ్ళి
కొట్టుకుపోయినపుడు కూడా
ఆ దీపం ఆరలేదు.
వానవానకు తాటాకుల మీద చప్పుళ్ళు
పాత ఆకు కొట్టేకొంది.
కొత్తాకు మారాకు తొడగడం చూచింది
మనవరాలు బొక్కులు తడవకుండా
కోళ్ళ గంప కప్పి
దానిమీద పట్టా ఏసింది.
కొడుకును చదివిద్దామని ఆశపడింది
బడి కూలిపోయింది
మనవరాలిని చదివిద్దామని
తపనపడింది.
ఊళ్ళో బడి మూసేస్తున్నారని కబురు
'ఏలేవాడు గుడ్డోడైతే
పేదేళ్ళ బతుకులకు దారేది' అంటుంది
ఆమె
చినుకుల్లో తడిసి
పిల్లోడికి జ్వరమొస్తే
ఆ భాగ్యమ్మ కషాయం కాసి
పోద్దామంటే ఇంట్లో దనియాలు లేవాయే!
'ఏందో సచ్చినోడు
తాగుడికి అలవాటు బడ్డాక
ఇల్లు'కాడు'తో సమానమైపోయింది.
ఎతుక్కొంటే రెండు మిరపగాయలు
దొరకడం లేదు
సర్కారోళ్ళే మందు కాసిపోస్తే
ఇక గంజి కాసుకునేదెక్కడ!
డొక్కల నుండి డాక్టరోడు
పెద్దసూదులతో చీము తీస్తున్నా
తాగేవాడికి సిగ్గు రావడం లేదు'
అని భాగ్యమ్మ వాపోయినా
ఇనేవాడేవరు?
ఆ పక్కింటోడు
తల్లి తలకాయ పగల గొట్టి
బొడ్డులో కూలి డబ్బులు లాక్కెళుతున్నాడు.
దొంగతనాలు చేసి
గొంతులో మందు పోసుకొంటున్నారు.
అంతా అరాచకమయ్యాక
ఎవరు ఎవరి మాట ఇంటున్నట్టు
స్కూల్లోకి పిల్లలు
'బొక్కులుతో రండిరా' అంటే
చారడేసి సెల్లులు తెచ్చి
బూతు బొమ్మలు చూస్తున్నారు.
చినుకులు పడ్డపుడంతా
మధ్యాహ్న భోజనం ఉడకనే ఉడకలేదు.
కడుపులో పిండాల దశలోనే
ఎబార్షన్లు అవుతున్నాయి.
రక్తం పోయిన పిల్లకు
గ్లాసుడు పాలిచ్చే స్తోమత లేదు.
మూడు రోజులుగా కూలి లేక పోతే
కళ్ళు పీక్కుపోయి
భుజాల ఎముకలు బయట పడుతున్నాయి
చిరిగిన జాకెట్టు కుట్టడానికి
సూదిలో దారం దిగదు
కళ్ళు బూజర్లు కమ్ముతున్నాయి
ముసురు జీవితంలో
ఎన్నో వ్యధలు, కథలు
పేదరాలి జీవితం
ఒక కన్నీటి గాథ
అభివ్యక్తికి అందని ఆత్మశోధ
నీతికి నిజాయితీకి పాతరేస్తున్న వారికి
ప్రతి చినుకు ఓ సంపదే!
సిగ్గును విడిచి పెట్టాక
అబద్ధ ప్రచారానికి వంద బాకాలు
అనంత దృశ్యాలు
మనుష్యులను మందల మందలగా
కొనేవాళ్ళకు
ముసురు బట్టిందా! ఎసరు కాగిందా!
ఎందుకు?
నోట్లకట్టలూ, మందు సీసాలు పంచేవాళ్ళు
పండగలు చేసుకొంటారు! అంతే!
ఆ ముసలమ్మ ఆత్మస్థైర్యం
ఆ సముద్రంలో దాగిన అగ్నికీల
మళ్ళీ పునరుజ్జీవనానికి సంకేతం
పాలకునికి కటకటాల వెనకే ఆత్మ
పరిశీలన.

డా॥ కత్తి పద్మారావు

ప్రపంచమంతా అతనిదే!

ప్రపంచంలో దేశాలెన్నని ప్రశ్నిస్తే.. ఆ 196 దేశాలను చూసి వచ్చేశానని నవ్వేస్తాడు ఆల్బర్ట్ పాదెల్. ప్రపంచ యాత్ర ఎలా అంటే, ఆప్యాయత నిండిన ఆదరింపుల నుంచి పోలీస్ ఇంటరాగేషన్‌ల బెదిరింపుల వరకు. పాత విమానాలపై ప్రమాదకర విహారాల నుంచి రిక్షాలో కులాసా ప్రయాణం వరకు.. అని వివరిస్తాడు. మనుషులంతా ఒకటేనని లోకం చూసిన ఈ ఎడిటర్ అనుభవంతో చెబుతున్నాడు.

ఆల్బర్ట్ పాదెల్‌కు చిన్నప్పుడు తపాలా బిళ్లల సేకరణ అంటే ఇష్టం. ఆ స్టాంప్‌లపై ఉండే వివిధ దేశాల ప్రత్యేక చిత్రాలంటే మరీ ఇష్టం. ఈ స్టాంప్ కలెక్షన్ పిచ్చి పాస్‌పోర్ట్‌పై అన్ని దేశాల స్టాంప్ పడేలా చేసిందని చెబుతాడు. 28 ఏళ్లకే ప్రపంచాన్ని చుట్టాలనే ఆశ రగిలిన ఆల్బర్ట్ ఓ బృందాన్ని కూడగట్టి మోటార్ వాహనాలపై యాత్ర చేపట్టాడు. యాత్రంతా విజయవంతంగా పూర్తయ్యాక ఏదో అసంతృప్తి. తిరిగి అదే ఊరుకి, అదే ఇంటికి, అదే వాతావరణానికి తిరిగి వచ్చేశానని చింత కలిగింది ఈ న్యూయార్కర్‌కు. ప్రపంచ యాత్రలోనే అలా తప్పిపోయింటే బావుంటుందనే భావన బలం పుంజుకుంది. ప్లేబోయ్ పత్రికకు సంపాదకుడిగా ఉద్యోగం వచ్చాక వీలున్నప్పుడల్లా విదేశీ యానం చేసేవాడు. అలా మధ్య వయసులోకి ప్రవేశించాక తాను అప్పటికే 90 దేశాల్ని చుట్టొచ్చాడని లెక్క తేలింది. ఈ 90నే 196 చేసి లోకాన్నంతటినీ చూడాలని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. భుజానికి సంచి తగిలించుకుని యాత్ర షురూ చేశాడు. కేవలం పది డాలర్లతో రాత్రులు ముగియాలని పరిమితి పెట్టుకున్నాడు. అలా ఒక్కో దేశం దాటుతూ 78 ఏళ్ల వయసు వచ్చేనాటికి అన్ని దేశాల్ని యాభై ఏళ్లలో చుట్టేసి 'ఎరౌండ్ ది వరల్డ్ ఇన్ 50 ఇయర్స్' అని పుస్తకం రాసేశాడు. తన అనుభవాలను అందరికీ పంచాలని, లోకంలో తాను చూసింది విప్పి చెప్పాలనే ఆ ప్రయత్నం. దట్టమైన అడవుల్లో, మిలిటరీ హద్దుల దగ్గర, గ్లేసియర్ పాద ప్రాంతంలో, ఎడారి కందకాల్లో, చెట్ల మీద, టెంట్ల కింద, ట్రెయిలర్లలో, ఒట్టి నేలపై, రోడ్ల పక్కన ఇలా ఎక్కడ కుదిరితే అక్కడ స్లీపింగ్ బ్యాగులో నిద్రావస్థను తీర్చుకున్నాడు.



ప్రయాణ పాట్లు...

ఆల్బర్ట్ పోలీస్ ఇంటరాగేషన్‌లను కూడా ఎదుర్కొన్నాడు. క్యూబాలో అమెరికన్ సీఐఏ గూఢచారి అని, ఈజిప్టులో యూదుడు అనుకుని అధికారులు స్టేషన్‌కు లాక్కెళ్లారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో ఓ నేరగాడు పెట్టిన తప్పుడు కేసు వల్ల కొన్ని రోజులపాటు జైలులో గడిపాడు. అల్జీర్స్, ఖైబర్ పాస్‌ల్లో దోపిడీకి గురయ్యాడు. ప్రాణం మీదకు తెచ్చిన ఘటన పాకిస్తాన్‌లో జరిగింది. అతడిని భారత గూఢచారి అనుకుని పాక్ సైనికులు దూసుకొచ్చారట. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల నుంచి తప్పించుకున్న అతడిని ప్రకృతి కూడా ముప్పు తిప్పలు పెట్టింది. హవాయికి దగ్గరలోని కిరిబాతి దీవుల్లో తప్పిపోయాడు. ఆ ద్వీప సముదాయంలో చాలా దీవుల్లో మానవ మనుగడే ఉండదు. 'ఒంటరిగా మీరు ఓ దీవిలో ఉండాల్సి వస్తే..' అని చాలామంది అడిగే ప్రశ్నకు ఆల్బర్ట్ అయితే సరిగ్గా సమాధానం చెబుతాడేమో. కోస్టారికా సముద్రంలో కొట్టుకుపోయినంత పనైంది. ఇలాంటివి చాలా అంశాల్ని తన పుస్తకంలో చేర్చాడు.

యెమెన్‌లో గొరిల్లాలు, అల్జీరియాలో ఎగిరే ఎండ్రకాయల దాడుల్ని చూశాడు. నీటి గేదెల గుంపు తరమితే తప్పించుకుని ప్రాణాలు దక్కించుకున్నాడు. ఆకలి బాధ తీర్చుకునేందుకు నానా రకాల జీవాల్ని తిన్నాడు. పనామాలో రోడ్డుపై చచ్చిపడున్న యాంట్ ఈటర్‌ను తినాల్సి వచ్చింది. ఆఫ్రికాలో పెద్ద ఎలుకల్ని, ఏనుగు పేడ పురుగును సైతం చప్పరించేశాడు. మధ్య అమెరికాలో ఇగువానా అనే జీవిని, ఆస్ట్రేలియాలో మొసలి మాంసాన్ని రుచి చూడక తప్పలేదట. వీలైనంత ఖర్చు తగ్గించు కునేందుకు ఎక్కువగా కాళ్లకే పనిచెప్పినా, అప్పుడప్పుడు పాత విమానాల్ని, ప్రమాదకర ఫెర్రీలను ఆశ్ర యించాడు. ఒంటెలు, గాడిదలపై కూడా ప్రయాణం చేశాడు.

ఇలా చూసినట్టు..

ఆ దేశం చూసినట్టుగా టిక్ కొట్టుకోవడానికి కొన్ని నియమాల్ని పెట్టుకున్నాడు. తాను వెళ్లేటప్పటికి అది స్వతంత్ర దేశంగా గుర్తించబడి, పాస్‌పోర్ట్ మీద స్టాంప్ వేయబడి, అధికారికంగా ప్రవేశానుమతి లభించాలి. ఆ దేశ రాజధానిని చేరుకుని కనీసం 24 గంటలు గడపాలి. ఏదో ఒక దిశలో ఆ దేశాన్ని క్రాస్ చేయాలి. అప్పుడే ఆ దేశాన్ని చూసినట్టు లెక్క. తాను ప్రత్యేకంగా పరిశీలించిన దేశాలకు స్వయంగా ఓ రేటింగ్ విధానాన్ని రూపొందించుకున్నాడు. ఆ దేశ పబ్లిక్ టాయిలెట్ల తీరే దానికి కొలమానం. అవి బాగుంటే అంతా బాగున్నట్టనేది ఆయన లెక్క. తాను పుట్టి పెరిగిన న్యూయార్క్ నగరానికే తక్కువ మార్కులు వచ్చాయి. కానీ, అన్ని జాతులు, సంస్కృతుల్ని ఒక చోట చేర్చిన ఆ నగరమంటే మాత్రం వల్లమాలిన అభిమానం అని చెప్పాడు. ప్రకృతికి నేపాల్, స్విట్జర్లాండ్ విందుకు వియత్నాం, థాయ్‌లాండ్, ఫ్రాన్స్.. సంస్కృతికి ఇంగ్లండ్, ఫ్రాన్స్, స్పెయిన్, ఈజిప్ట్‌లకు మార్కులు వేశాడు. ప్రపంచ మంతటా అనుబంధాలు, బాంధవ్యాలు, ప్రేమలు, స్నేహాలు, మంచి-చెడు, ఆశలు, ఆదర్శాలన్నీ ఒకే విధంగా కనిపించాయని అంటాడు. మానవ జాతి తీరు అంతా ఒక్కటేనని అనుభవాలతో చెబుతున్న ఆల్బర్ట్ మాటలు చాలా మందికి ఇప్పటికే చేరిపోయాయి.

ఇట్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు అన్నారు పెద్దలు! వాటిలో ఉండే కష్టనష్టాలు దృష్టిలో పెట్టుకుని! కాని అది ప్రస్తుతం పాత బడిన సామెత లా మారింది. ఇల్లు కట్టుకోవడమూ, పెళ్ళి చేసుకోవడమూ రెండు ఇప్పుడు సునాయసంగానే జరిగిపోతున్నాయి.

స్పీడు నిర్మాణాలు

ఒక ఇల్లు గానీ మరేదైనా నిర్మాణం గానీ జరిపించాలంటే భూమిలో పునాదులు నుండి పైకప్పు వరకూ ఎంతో వ్యవధి అవసరమయ్యే ప్రక్రియలు ఇమిడి ఉండే కార్యక్రమం. కొన్ని నెలలు, కొన్ని సంవత్సరాలు కూడా గడిచిపోతాయి. కానీ క్రమేపీ ఆ పద్ధతి మారుతోంది.

మనుషులతో తవ్వే బదులు భారీ యంత్రాలు వచ్చాయి. వారాలు పట్టే చదును చేయడాలు, పునాదులు తవ్వడాలూ వంటివి కొన్ని రోజుల్లో అయిపోతున్నాయి. నిర్మాణం దగ్గర కలిపే కాంక్రీటు ఇప్పుడు ఎక్కడో ముందుగానే కలపబడి అందుబాటులోకి వస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి వారాల తరబడి నీళ్ళతో తడిపే అవసరం లేని రెడీమేట్ కాంక్రీటు లభ్యమయింది. హైదరాబాద్ మెట్రో పిల్లర్లు ఈ తరహా కాంక్రీటుతోనే ధృడంగా తయారు చేశారు. అలాగే నిర్మాణానికి అవసరమైన అనేక భాగాలను గోడలూ, గుమ్మాలు, తలుపులూ వంటివి మరెక్కడో ముందే తయారు చేసిన వాటిని తీసుకువచ్చి అమర్చే విధంగా రూపొందిస్తున్నారు.

ఈ పద్ధతుల వలన నిర్మాణం త్వరగా పూర్తవుతుంది. ఈ టెక్నాలిజీని ప్రీకాస్ట్ టెక్నాలజీ అంటున్నారు. దీని వల్ల కూలీల సమస్య, నాణ్యత సమస్య, సమయాభావం వంటివన్నీ తీరిపోతాయి. ఒక నిర్మాణం సాంప్రదాయ పద్ధతుల్లో చేసే కంటే 65 శాతం వేగంగా ప్రీకాస్ట్ టెక్నాలజీతో పూర్తి చేయవచ్చు. అంటే మామూలు నిర్మాణాలు పూర్తవడానికి ఒక సంవత్సరం పడితే ప్రీకాస్ట్ తో కేవలం నాలుగు నెలల్లో ముగించవచ్చు. పైగా మరింత ధృడంగా నాణ్యంగా, దీర్ఘకాల మన్నికతో మరో విశేషం ఏమిటంటే ఈ కొత్త తరహా నిర్మాణ పద్ధతిలో నిర్మాణ వ్యయం 10-15 శాతం తగ్గుతుంది కూడా!

రికార్డులు

కొత్త తరపు నిర్మాణ ప్రక్రియగా భావిస్తున్న ప్రీఫాబ్ టెక్నాలజీ సాయంతో చాలా అద్భుతంగా జరిగాయి. ఒక ఫ్యాక్టరీలో విడిభాగాలన్నీ రూపొందించి అసలు నిర్మాణ ప్రదేశంలో వాటిని అమర్చడం ఈ పద్ధతిలో కీలకం. ఈ పద్ధతిలో అతి వేగంగా నిర్మించిన మూడు నిర్మాణాలు ఇవి. చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లో 2011లో 328 అడుగుల ఎత్తున్న 30 అంతస్తుల "టి 30" భవంతి 15 రోజులల్లో పూర్తయింది. ఇది ప్రపంచంలో మూడవ అతి వేగవంతమైన నిర్మాణం చేసుకున్న భవంతి. చైనాలోని "మినీ స్కై సిటీ" అనే మరొక 57 అంతస్తుల భవంతి రూపుదిద్దుకుంది. దీని కోసం వెచ్చించింద 19 రోజులు మాత్రమే ఈ భవంతిలో 800 అపార్ట్‌మెంట్లున్నాయి. ఒకటవ స్థానం మనమే! మోహాలీలో నిర్మించిన 10 అంతస్తుల భవంతి ప్రపంచంలో అత్యంత వేగంగా నిర్మాణం జరుపుకుంది. ఇది పూర్తి కావడానికి పట్టిన సమయం -రెండు రోజులు. చైనాలోని 30 అంతస్తుల హోటల్ 1,83,000 చదరపు అడుగుల విస్తరించుకుని ఉంది. దానికి నిర్మించడానికి పట్టిన సమయం ఎంతో తెలుసా? కేవలం 15 రోజులు అంటే 360 గంటలు. ఇంత అద్భుతాన్ని చేసే క్రమంలో ఒక్క పనివాడికి కూడా కనీసం గాయమైనా కాలేదు. ఈ 30 అంతస్తుల హోటల్ 2వ స్థాయి భూకంపాన్ని కూడా తట్టుకుని నిలబడగలదు. ఇందులోని గోడలన్నీ సౌండ్ ప్రూఫ్ లోపల గాలి నాణ్యత నియంత్రణ వ్యవస్థ కూడా ఉంది. మన దేశంలో చండీగఢ్‌లో కేవలం 48 గంటల్లో 25,000 చదరపు అడుగుల భవంతిని కట్టేశారు. ఈ సది అంతస్తుల భవనాన్ని నిర్మించడానికి 200 మంది రెండు రోజులు పని చేశారు. ఇతర సాధరణ నిర్మాణాల మాదిరిగా నీరు కారణం, గోడల్లో చెమ్మ చేరడం, సన్నని పగుళ్ళు రావడం వంటివి అస్సలుండవని అంటున్నారు. ఇంతవరకు అటువంటివి అనుభవంలోకి రాలేదు.దాదాపు 600 సంవత్సరాల వరకు ఈ నిర్మాణం చెక్కు చెదరకుండా ఉంటుందని ఇంజనీర్లు ధీమాగా ఉన్నారు.

ఇలా స్పీడుగా కట్టడం రికార్డుల కోసమే కాకుండా అవసరం కూడా కావచ్చు. ప్రకృతి వైపరీత్యాల బారిన పడి జరిగే ఆస్తినష్టాన్ని భర్తీ చేయడానికి వసతి కోల్పోయిన బాధితులకు సత్వరమే వసతి కల్పించడానికి కూడా ఇటువంటి స్పీడు గృహలు అవసరమౌతాయి. రెండేళ్ళ క్రితం ఉత్తరాఖాండ్ వరద భీభత్సం మూలంగా సుమారు 3,000 కుటుంబాలు గృహలు కోల్పోయాయి. ఆ ప్రాంతంలో దాదాపు 2500 ప్రీ ఫాబ్రిక్ గృహలు ఏడాది ఆఖరికు తయారయ్యాయి. భవిష్యత్తులో ఈ తరహ కాలనీలు బహుళ అంతస్తుల భవంతుల నిర్మాణం విస్తరించింది. ప్రజాదరణ పొందడానికి కాస్త సమయం పట్టవచ్చు. ప్రతి కొత్త పద్ధతికి ఉండేలాగా దీనికి ముందుగా వ్యతిరేకత ఎదురవ్వచ్చు. ఆ అనుమానాలు ఆధారంగా నిర్మాణాల్లో మార్పులు చేర్పులు జరగవచ్చు. మొత్తానికి ఇల్లు కట్టుకోవడానికి వారం పదిరోజులకంటే ఎక్కువ సమయం పట్టకపోవచ్చు.

- డా॥ కాకర్లమూడి విజయ్



ఆమెకు 21 సంవత్సరాలు. అవివాహిత. కానీ ఆరేళ్ల కూతురుంది. కడలూరుకు 80 కిలోమీటర్ల దూరానున్న కుగ్రామంలో నివాసం. అదీ ఒంటరి గదిలో. గత కొద్ది రోజులుగా ఆమెకు మనశ్శాంతి దూరమైంది. అది కొత్తేమీ కాకపోయినా... తాజా ఘటన ఆమెను తీవ్ర అశాంతికి గురిచేసింది. ప్రస్తుతానికి కోపమూ నిరాశలే ఆమె తోడు నీడలు. కష్టాలన్నీ కలసికట్టుగా చుట్టుకున్నట్టు అనిపిస్తున్న ఆమె దీన గాథ....

ఏదో ఓ రోజు... తన తండ్రి రేపిస్ట్ అని చెప్తా!

అది 2008వ సంవత్సరం. అప్పుడామెకు పద్నాలుగేళ్లు. ఆ మధ్యాహ్నం జరిగిన ఘటనను ప్రాణాలతో వుండగా మర్చిపోలేదు. అంతటి చేదు సంఘటన. సరిగ్గా పదవ తరగతి పరీక్షలు మరో రెండు రోజుల్లో ప్రారంభమౌతాయనగా జరిగిందది. అతనో అండర్ గ్రాడ్యుయేట్. ఇద్దరూ పరిచయస్తులే. ఇద్దరికీ తెలిసిన మిత్రులు కూడా వున్నారు. శీతల పానీయంలో మత్తు మందు కలిపిచ్చి ఆమెపై అత్యాచారానికి తెగబడ్డాడా మృగాడు. ఫలితంగా ఆమె గర్భం దాల్చింది. ఈ దారుణాన్ని తల్లిదండ్రులకు తెలియచేసిందామె. వారతన్ని ప్రశ్నించగా బెదిరించాడు. భయపెట్టాడు. అబార్షన్ చేయించుకోమని ఒత్తిడి చేశాడు. అంతటితో ఆగక అందులో తన పాత్ర లేదని, గర్భానికి తను కారణం కాదని వాదించాడు. డి.ఎన్.ఎ పరీక్ష అబద్ధం చెప్పదుగా. పాప పుట్టాక అసలు నిజం బైటపడింది. అతను చేసిన తప్పును అంగీకరించలేదు సరికదా... వారి మానాన వారిని విడిచిపెట్టేశాడు. అత్యాచారం గురించి తెల్సిన గ్రామం మొత్తం వీరిని బహిష్కరించింది. బంధువులు, స్నేహితులు పలకడం మానేశారు. జరిగిన ఘోరానికి సంఘ బహిష్కరణ తోడవడంతో ఆ కుటుంబం మొత్తం కుంగిపోయింది. న్యాయం కోరుతూ మహిళా న్యాయస్థానాన్ని వేడుకొందామె. అంతటి నీచానికి పాల్పడిన అతనికి రెండు లక్షల జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష విధించింది.

సరిగ్గా తనకు శిక్ష ఖరారయ్యాక అతనిలో ఆలోచన, పరివర్తన ప్రారంభమైంది. కేసు నుంచి, శిక్ష నుంచి బైట పడాలంటే అదొక్కటే మార్గమని భావించాడు. హైకోర్టుకు వెళ్లి...ఆమెను పెళ్లాడతానని, కేసు నుంచి విముక్తుణ్ణి చెయ్యమని జడ్జిగారిని వేడుకున్నాడు. అతనిలోని మేక వన్నె పులిని అర్థం చేసుకోలేని జడ్జిగారు మధ్యవర్తిత్వానికి సిద్ధమయ్యారు.

'కేసు సుఖాంతం కానుంది. నిందితుడు బాధితను పెళ్లాడేందుకు సిద్ధంగా వున్నాడు. వాస్తవ పరిస్థితులు పరిశీలించిన దృష్ట్యా రెండు వర్గాల మధ్య రాజీ కుదర్చడం సరైనది'గా భావించారు జడ్జి. కానీ బాధితురాలు అందుకు సుముఖంగా లేదు. 'నా అభిప్రాయం తీసుకోకుండా జడ్జిగారు అలాంటి తీర్పు ఇవ్వడం సరికాదు. నేను బాధితురాలినని ఆయన మర్చిపోయినట్టున్నారు. నన్ను ఇంతటి కఠిన పరీక్షకు గురిచేసిన అతను అకస్మాత్తుగా పెళ్లాడడానికి అంగీకరించాడు. మధ్యవర్తిత్వానికి అంగీక రించడం ద్వారా జైలు శిక్ష నుంచి తప్పించుకునేందుకే ఇదంతా. డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలున్నాయి. కానీ ఆత్మ గౌరవాన్ని కొనలేం కదా. నా మీద దౌర్జన్యం చేసిన వాడితో కలిసి ఎలా బతి కేది? ఈ తీర్పును రద్దు చేయమని మాత్రమే నేను జడ్జిగారిని కోరగలను' అన్నది బాధితురాలి ఘోష.

'నేను కనక ఈ పరిష్కారానికి అంగీకరించి నట్లయితే నా కూతురు నన్ను ప్రశ్నించ వచ్చు. ఈ ఒప్పందానికి అంగీకరించడం వల్ల మాకు ఎంతో కొంత ఉపకారం అందవచ్చు. కానీ ఒక రేపిస్టు కూతురిగా పెంచడం వల్ల నా బిడ్డ భవిష్యత్ ఏమౌతుంది? నేను జీవితాంతం పోరాడతానే కానీ రాజీ ఒప్పందానికి మాత్రం అంగీకరించేదే లేదు. బతకడానికి నేను ఎంతగా పోరాడానో నా కూతురికి చెప్తాను. తన తండ్రి గురించి అడిగిన ప్రతిసారీ లేదని చెప్తున్నాను. ఆమె అర్థం చేసుకునే వయసు వచ్చినప్పుడు తప్పక చెప్తాను. తన తండ్రి ఒక రేపిస్ట్ అని' అంటోంది బాధితురాలు స్థిరంగా. ఇప్పుడు పాపకు ఆరేళ్లు. ఇన్నేళ్లూ ఒంటరిగానే బతుకు తున్నారు తల్లీకూతుళ్లు. కూలీనాలీ చేసుకుంటుంది. గతంలో తిరుపూర్‌లోని బట్టల పరిశ్రమలో కొంత కాలం పనిచేసింది. ప్రస్తుతం ఆమె తమ్ముడు ఎంతో కొంత డబ్బు సర్దుతున్నాడు.

బాధితుల పక్షాన నిలవాల్సిన జడ్జీలే .... వారిని నేరుగా పులి బోనులోకి పంపించేటువంటి తీర్పులివ్వడం వివాదాస్పదమైంది. ఆఖరికి సుప్రీం కోర్టు కలగచేసుకొని అత్యాచార కేసుల్లో రాజీలు కుదిర్చే మధ్యవర్తిత్వ పనులు మానుకోమని కింది కోర్టు జడ్జీలకు మొట్టికాయలు వేయాల్సి వచ్చింది.

తుపాకీ శాంతి గీతం

తుపాకీ ట్రిగ్గర్ నొక్కితే ప్రాణాల్ని తీసే తూటా గుండెల్లోకి దూసుకు రాదు. శాంతి గీతాలకు స్వరాలు కూర్చుతూ మనసులోకి దూసుకెళ్లే సంగీతం మాత్రమే పలుకుతుంది. అవి బొమ్మ తుపాకీలు కావు. సంగీత పరికరాలుగా ప్రాణం పోసుకున్న నిజం తుపాకీలు. శాంతి సందేశాన్ని వినిపిస్తున్న పెడ్రో రేయెస్ చేతబడి కారుణ్యాయుధాలుగా మారిపోయాయి. నిరాయుధీకరణ ప్రచారానికి సరికొత్త సంగీత వాయిద్యాలవి.

పెడ్రో రేయెస్‌ది మెక్సికో. ఆ దేశం మాదక ద్రవ్య, ఆయుధ మాఫియాలకు కేంద్రం. అక్కడ అక్రమంగా కొన్ని లక్షల మారణాయుధాలు ఇళ్లలోకి చేరిపోయాయి. భార్యాభర్తల మధ్య గొడవలకు తూటానే పరిష్కారం. పోటీ వ్యాపారికి తూటాతోనే సమాధానం. ఓ పర్సు దొంగతనానికి గన్‌నే గురిపెట్టేలా ఆయుధ సంస్కృతి పతాకస్థాయికి చేరిపోయింది. ఏటా వేల మందిని ఈ తూటాలే బలిగొంటున్నాయి. అక్కడి అధికారులు తీవ్ర స్థాయిలో శ్రమించినా తుపాకీల పిచ్చి వదిలించలేకపోతున్నారు. ఏ కుటుంబాన్ని కదిపినా ఓ తూటా హంతకి కథ చెబుతాయి. పెడ్రో రేయెస్‌కు ఇలాంటి చేదు గతముంది. తాను అమితంగా ఇష్టపడే బంధువు, తన ప్రాణ మిత్రుడు దోపిడీదారుల చేతుల్లో ఆ తూటాలకే హతులయ్యారు. ఇది పెడ్రోకు నిద్ర పట్టనివ్వలేదు. ఎక్కడ విన్నా ఈ తుపాకీ హత్యలే. క్షేమంగా ఇల్లు చేరగలరో లేరో అనే బెంగతో ఇంటివారు ఎదురుచూపులు అక్కడ సాధారణం. ఈ పరిస్థితిని మార్చాలి. తుపాకీ జాడ్యాన్ని వదల్చాలి. పెడ్రో సంకల్పం బూనాడు. తన కళతో సమాధానం వెతికాడు. పెడ్రో వీధి కళాకారుడు. ఆయన కళకు మెచ్చి 2013 షార్జా ఉత్సవాల్లో అవకాశం ఇచ్చారు. సేంద్రియ పదార్థాలతో అతడు రూపొందించిన వినైల్ కళాఖండాలకు మంచి గుర్తింపు లభించింది. అక్కడ అతడికి అంతర్జాతీయ కళాకారులు మిత్రులయ్యారు. వారి ద్వారా సెర్బియా కళాకారుల ఉద్యమం గురించి తెలిసింది. అవినీతి, లంచగొండితనాలకు వ్యతిరేకంగా సుమారు 800 మంది కళాకారులు తమ సృజనతో బెల్‌గ్రేడ్‌లోని రిపబ్లిక్ స్క్వేర్ దగ్గర చేసిన కార్యక్రమం ఆలోచనలో పడేసింది. తన మాతృదేశానికి తన కళ ద్వారా సేవ చేయాలని అనుకున్నాడు.

మెక్సికో బొటానికల్ గార్డెన్‌కు పని చేయాలని ప్రభుత్వం కోరడంతో అదే సరైన సమయమని భావించి తన ప్రాజెక్టును ప్రారంభించాడు. స్థానిక అధికారులతో మాట్లాడి మెక్సికో నగరంలో ఓ ప్రచార కార్యక్రమాన్ని రూపొందించాడు. తమ దగ్గరున్న ఆయుధాలను వెనక్కు ఇచ్చేస్తే వాటికి బదులు గృహావసర, ఎలక్ట్రానిక్ పరికరాలు ఇస్తామని చాటింపు వేయించాడు. స్థానిక టౌన్ హాల్లో సుమారు 1527 ఆయుధాలను ప్రజలు వెనక్కు ఇచ్చేశారు. వాటిని ఓ స్టీమ్‌రోలర్‌తో తొక్కించి, కార్ఖానాలో కరిగించి మొక్కలు పెంచుకునే బేసిన్‌లుగా తయారుచేశాడు. వాటిని పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలకు తరలించాడు. బొటానికల్ గార్డెన్‌లో వాటిని ఉపయోగించాడు. ఈ పనికి అనూహ్య స్పందన లభించింది. ప్రభుత్వం మద్దతునిచ్చి మాఫియాల నుంచి సీజ్ చేసిన మరో 8000 అక్రమ ఆయుధాలను అప్పగించింది. వాటిని మరో బృహత్తర పథకానికి ఉపయోగించాడు పెడ్రో. తన మిత్రులతో కలిసి పనిచేసి వాటిని సంగీత వాద్య పరికరాలుగా మార్చేశాడు. వాటిని రూపొందించేందుకు, ఉపయోగించేందుకు యువతకు ప్రత్యేక వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేశాడు. 16-25 ఏళ్ల మధ్యనున్న యువత ఆకర్షితులై వాటితో ప్రచార కార్యక్రమాలను నిర్వహించి దేశం నలుమూలలకు శాంతి సందేశాల్ని తీసుకెళ్లారు. ఇది గొప్ప మార్పు. ఈ ప్రాజెక్టు ఊహించనంతగా విజయవంతం కావడంతో గన్ కల్చర్ ఎక్కువైన మిగతా దేశాల మెట్రో నగరాలకు టూర్ వేశారు. మారణాయుధాన్ని కలిగి ఉండేందుకు అవకాశమిస్తున్న అమెరికన్ చట్టం మార్చాలని ఫ్లోరిడా విద్యార్థులు పెడ్రో పరికరాలతో నిర్వహించిన సంగీత ప్రదర్శన 'అమెండ్‌మెంట్ టు అమెండ్‌మెంట్' సంచలనమైంది. ఆ సంగీత పరికరాలను ఫ్లోరిడా కాంటెపరరీ ఆర్ట్ మ్యూజియంలో ప్రదర్శించి గౌరవించారు. లాస్ ఏంజెలెస్, న్యూయార్క్, లండన్ వంటి మహా నగరాల్లోను నిరాయుధీకరణ సందేశాన్ని వినిపించిందా బృందం. వాటితో 'డిసార్మ్' అనే సంగీత రికార్డ్‌ను రూపొందించి ప్రపంచవ్యాప్త ప్రచారాన్ని విస్తృతం చేసింది. మాఫియా బెదిరింపు లేఖల్ని పక్కకు పెట్టిన పెడ్రో మరో అడుగు ముందుకేసి 'పీపుల్స్ యునైటెడ్ నేషన్స్' (ప్రజా ఐక్యరాజ్య సమితి)ని స్థాపించాడు. సామాన్యులే ఆయా దేశాలకు నేతృత్వం వహిస్తారు ఆ సమితిలో. రాజకీయాలకు అతీతంగా అక్కడ చర్చలు సాగుతాయి. ఆయుధ నిర్మూలనే ప్రధాన లక్ష్యం. 'సాంటోరియం' అనే కేంద్రంలో కళకు మానసిక శాస్త్రాన్ని మేళవించి ఓ కొత్త థెరపీని సృష్టించాడు.





నది అంటే ప్రవహించునది అని అర్థం. ప్రవాహం అంటేనే చైతన్యానికి సంకేతం. నది పుట్టినది మొదలు- సముద్రంలో సంగమించేదాకా నడయాడిన నేలల్లా పచ్చదనం. ఆ జలసిరిని పొందికగా పొదువుకుంటే ఆ దారంతా ఒక పూలవనం. అందుకనే గోదావరి జన గోదావరిగా పరిమళిస్తోంది. ప్రయోజన గోదావరిగా కోట్లాదిమందిలో ప్రవహిస్తోంది. మేలు చేసే నేలకు, నీరుకు, నిప్పుకు, నింగికి, ప్రాణప్రదమైన గాలికి ప్రణమిల్లడం అనాది నుంచి మనిషి ఆనవాయితీ! చేతులెత్తి నమస్కరించటం సంస్కారం! గోదావరి నదీ పుష్కర ప్రాభవానికి ఈ కృతజ్ఞతే మూల కారణం.

- సత్యాజీ, 94900167

జన గోదావరి

గోదావరి ... తెలుగు రాష్ట్రాల బతుకు గుండెకు ఆధార ధమని. నవీన నాగరికతల, సంగీత, సాహిత్యాల చైతన్య వాహిని. నిరంతర ప్రవాహిని. తెలుగువాళ్ల నిత్య సంతోషిణి. గలగలల సుహాసిని. సకల జన ప్రియ భాషిణి. తెలుగిళ్లకు పాడిపంటలూ, పచ్చదనాల పరవశాలూ ఒసగే వరదాయని. ఆధునిక జీవనానికి, అనేక వికాస ప్రకాశాలకు ప్రదాయని. ఇన్ని ఉపయోగాలకు కారణం అవుతుంది కాబట్టే- గోదావరికీ, జన జీవనానికీ అంత అనుబంధం. విడదీయలేని సంబంధం.

ఎక్కడో పుట్టి .. తెలుగింటికొచ్చి ...

గోదావరి జన్మస్థానం మహారాష్ట్రలోని నాసికా త్రయంబకం. అక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది వద్ద సముద్రంలో కలిసేవరకూ 1,465 కిలోమీటర్ల మేర ప్రవహి స్తుంది. ఈ మార్గమధ్యంలో దానిలో 32 ఉప నదులు కలుస్తాయి. మరో ఎనిమిది సెలయేర్లు కూడా సంగమిస్తాయి. త్రయంబకం వద్ద చిన్నపాటి ధారగా కనిపించే గోదావరి- ఉపనదులతో కలిసి నెమ్మది నెమ్మదిగా పెద్ద ప్రవాహం అవుతుంది. పుట్టినచోట అటునుంచి ఇటు గెంతు వేయగలి గినంత సన్నని కాలువ. రాజమండ్రికి వచ్చేసరికి మూడు కిలోమీటర్ల వెడల్పుకు విస్తరిస్తుంది. ధవళేశ్వరం వద్ద ఏడు పాయలుగా విడివడి, కనుచూపుమేరా నదీ జల, సైకత రూపాలు దర్శన మిస్తాయి. వైన గంగ, వార్ధా, పెనుగంగ, మంజీర, ఇంద్రావతి, బిందుసార, శబరి, ప్రవర, ప్రాణహిత, సీలేరు, కిన్నెరసాని, మానేరు వంటివి గోదావరిలో కలిసే ఉప నదులు. దేశంలో గంగానది తరువాత పెద్ద జీవనది గోదావరే! అందుకనే, దీనికి దక్షిణ గంగ అని పేరు.గోదావరి తెలుగు రాష్ట్రాలను సస్యశ్యామలం చేస్తోంది. కోట్లాదిమంది ప్రజలకు బతుకునిస్తుంది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అత్యధికంగా 11 లక్షల ఎకరాలకు జీవం పోస్తోంది.

అమ్మ వంటిది నది

నది అమ్మ వంటిది. చల్లని చూపుల తల్లి వంటిది. సహజంగానే తన ఒడిలోకి సమస్త జీవకోటిని ఆహ్వానిస్తుంది. ఆకలి తీర్చుతుంది. ఆలోచన జత చేస్తే - శాశ్వత ప్రగతికి సోపానమవుతుంది. ఆనకట్ట కట్టి, పొలాలకు మళ్లిస్తే- బంగారు వన్నెల ధాన్యమవుతుంది. అరటిపంటల ఆదరవవుతుంది. పచ్చదనాల

సేద్యమవుతుంది. అభివృద్ధి సాధ్యమవుతుంది. నది మనిషిని సంస్కరిస్తుంది. నవ నాగరికుణ్ణి చేస్తుంది. అలసిపోతే సేద తీర్చుతుంది. ఆటపాటలకు నెలవవుతుంది. సంబరాలకు, సందళ్లకు శ్రీకారం చుడుతుంది. పండగలను, పర్వదినాలను ప్రోత్సహిస్తుంది. నదికి ఉన్న లక్షణం ఇది.

నది నడయాడిన నేలంతా చైతన్యశక్తిని పుంజుకుంటుంది. దాహార్తి తీర్చుకున్న ఓ గొడ్ల కాపరి గొంతెత్తి పాడతాడు. ఆ నదీపాయలో కడవెత్తుకు వెళుతున్న కన్నెపిల్ల కూనిరాగం తీస్తుంది. పరుగెత్తికొచ్చిన పిల్లల బృందం ఏదొక ఆటకు ఉపక్రమిస్తుంది. నెమ్మదిగా సందడి అలముకుంటుంది. పంట దిగుబడి బాగుందని రైతులు గోదారికి చేతులెత్తి నమస్కరిస్తారు. మరోసారి వరదై విరుచుకుపడొద్దని ప్రాధేయపడతారు. ఇంకోసారి ఎండిపోయి, బతుకులు మాడ్చేయవద్దని విన్నవిస్తారు. కాలక్రమంలో ఇవే సాంప్రదాయాలుగా మారాయి... క్రమం తప్పని పండగలుగా పరిణమించాయి.

ఆనకట్టతో అభివృద్ధి పథం

నదిని తన మానాన తనని వదిలేస్తే- వరద అవ్వొచ్చు. కరువూ కావొచ్చు. అనువైన చోట ఆనకట్ట వేయాలి. అవసరమైనచోటికి నీరు మళ్లించాలి. సర్ అర్థర్ కాటన్ 1852లో ధవళేశ్వరం వద్ద అదే పని చేశాడు. గోదావరి జిల్లా ప్రజలకు ప్రాత:స్మరణీయుడుగా మిగిలిపోయాడు. అంత వరకూ గోదావరికి వరదలు వస్తే- అక్కడి ప్రజల బతుకులు అతలాకుతలం. సర్వం గోదారి పాలు. ఆనకట్టతో నీటిపై అదుపు సాధ్యమైంది. భూములు బంగారు పంటలకు ఆలవాలం అయ్యాయి. అనతికాలంలోనే ఈ ప్రాంతాలు అభివృద్ధి పథం పట్టాయి. వ్యవసాయంలోని మిగులు వ్యాపారంలోకి మళ్లింది. చిన్ని చిన్ని వ్యవసాయాధారిత పరిశ్రమలూ ప్రారంభమయ్యాయి. గోదావరి పరివాహక ప్రాంతాలు సంపదకు, సంపన్నతకు నిలయాలు అయ్యాయి. మద్రాసు, బెంగళూరు, హైదరాబాదు వంటి నగరాలకు వివిధ రూపాల్లో ఇక్కడి నుంచి పెట్టుబడులు వెళ్లాయి. సినిమారంగంలో అనేక విభాగాల్లో గోదావరి ప్రతిభాపాటవాలు ప్రకాశించాయి. విద్య, వైద్యం తదితర రంగాల్లోనూ అనేక మార్పులు సంభవించాయి.

ప్రతిభామూర్తుల పుట్టిల్లు

సంగీత, సాహిత్యాలు; సాంఘిక సంస్కరణోద్యమాలు పరిఢవిల్లడంలో కూడా

పుష్కరం : పన్నెండేళ్లకొచ్చే పండగ

పుష్కరం అంటే 12 ఏళ్లు. 12 ఏళ్లకు ఒకసారి నదులకు జరిగే ఆరాధనే పుష్కరాలు. మనదేశంలో ఏటా ఏదొక నదికి పుష్కర సందడి ఉంటుంది. గంగానది మొదలుకొని, ప్రాణహిత వరకూ వరస క్రమంలో ఈ సంరంభం సాగుతుంది. యమునానదికి ఉత్సవం జరిగిన మరుసటి సంవత్సరం గోదావరికి పుష్కరాలు వస్తాయి. ఈసారి గోదావరి పుష్కరాలు ఏ తేదీ నుంచి అనే విషయమై సిద్ధాంతుల మధ్య స్పష్టత లేదు. ఒక్కొక్కరు ఒక్కో కారణం చెప్పి, పుష్కర స్నానాలు మొదలు పెట్టారు. ప్రభుత్వం మాత్రం జులై 14 నుంచి 25 వరకూ అని ప్రకటించింది. ఏ నదికీ లేనివిధంగా గోదావరికి అంత్య పుష్కరాలు కూడా ఉన్నాయి. ఆ సందడి వచ్చే ఏడాది జులై 14 నుంచి ప్రారంభమవుతుంది. ఒడిషా యాత్రికులు మాత్రమే అప్పుడు స్నానాలు ఆచరిస్తారు. ఈ ఏడాది 5 కోట్ల మంది గోదావరి పుష్కర స్నానాలు చేస్తారని అంచనా.

ఆహా .. ఏమి రుచి ..!

జరుగుబాటు, చెల్లుబాటు ఉన్న చోట సాంప్రదాయాలు, ప్రత్యేకతలూ అందరి ఆమోదాన్ని ఆపాదించుకుంటాయి. జనరంజకంగా మారతాయి. గోదావరి జిల్లాల్లో దాదాపు ప్రతి ప్రాంతానికి ఒక ప్రత్యేక వంటకం ఉంటుంది. వాటికి ఆదరణ చెక్కు చెదరదు. ఆత్రేయపురం పూతరేకులు; కాకినాడ, తాపేశ్వరం కాజాలు; పెద్దాపురం కోవా, చెక్కవడ; భీమవరం నాన్‌వెజ్ పచ్చళ్లు, అంబాజీపేట పొట్టిక్కలు, అమలాపురం సోంపాపిడి, గొల్లల మామిడాడ ఇమిర్తి, పెరుమళ్లాపురం పాకం గారెలు, పాలకొల్లు దిబ్బరొట్టెలు, పెరవలి పచ్చళ్లు, పెనుగొండ కజ్జికాయలు ... ప్రసిద్ధి. ఇవి జిల్లాలోనే కాదు; ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో ఉన్న గోదావరి వాసులను కూడా నోరూరిస్తూ ఉంటాయి.

గోదావరి పాత్ర గొప్పది. వ్యాస మహాభారతం తెలుగులోకి తర్జుమా చేసే తొట్టతొలి కృషికి రాజమహేంద్రే కార్యస్థలి. రాజరాజ నరేంద్రుడి హయాంలో నన్నయ భట్టారకుడు ఆ మహా క్రతువుకు శ్రీకారం చుట్టాడు. పిఠాపురం సంస్థానపు సహాయంతోనే సూర్యరాయాంధ్ర నిఘంటువు రూపుదిద్దుకుంది. రాజమండ్రి, పిఠాపురం, కాకినాడ, ఏలూరు వంటి గోదావరి పట్టణాలు పుస్తక ప్రచురణకు, సాహిత్య వికాసానికీ ఎంతో దోహదపడ్డాయి. సంఘ సంస్కరణోద్యమ కర్త కందుకూరి వీరేశలింగం విశేష కృషికి రాజమండ్రే కార్యక్షేత్రం.

అనేకమంది కవులకు, రచయితలకు, గాయకులకు, సంగీతాజ్ఞులకు, నటీనటులకు పుట్టినిల్లు గోదావరి. నాటి ఆదుర్తి సుబ్బారావు నుంచి నేటి రాజమౌళి దాకా సినీ దర్శకులు అనేకమంది. తిరుపతి వెంకట కవులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశర్మ, బాలమురళీకృష్ణ, వెంపటి చిన సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు, గరికపాటి రాజారావు, అంజలి, చిరంజీవి, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య, బాపు, ముళ్లపూడి వెంకట రమణ, ఆవంత్స సోమసుందర్, బోయి భీమన్న, అద్దేపల్లి రామ్మోహనరావు, యండమూరి వీరేంద్రనాథ్, డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు …. ఇలా వివిధ రంగాల నిష్ణాతులు గోదావరి బిడ్డలే!

మత్స్యకారుల బతుకు దారి

లక్షలాది మంది మత్స్యకార కుటుంబాలు గోదావరి బతుకుదారి. నదిలోని లంకలు, ఏటిగట్లు వారికి ఆవాసాలు. నిత్యం గోదారితోనే సహజీవనం సాగిస్తూ.. బతుకు నావ లాగుతున్నారు. నదీపాయల మధ్య చాలా మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. గోదావరిలో అపారమైన మత్స్య సంపద ఉంది. పీతలు, రొయ్యలు, పులస, చీరమేను, ఎర్రమోసు, పండు గొప్పలు, కట్ట చేపలు, కొయ్యింగలు, బొచ్చు, శీలావతి, జెల్ల, పాలెపు జెల్ల వంటి రకాలు గోదావరిలో దొరుకుతాయి. వాటిని మగవాళ్లు సేకరిస్తే– మహిళలు అమ్మకాలు సాగిస్తారు.

- గోదావరి నీరు పొలాలకే కాదు; ప్రజల తాగునీటికీ ఉపయోగపడుతుంది. ఈ జిల్లాల్లోని సుమారు కోటి మందికి అన్ని అవసరాలూ తీరుస్తుంది. మున్సిపాల్టీలు, పంచాయతీలు గోదావరి నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నాయి. సుమారు 25 లక్షల పశువులకు తాగునీటిని గోదావరి అందిస్తోంది. గోదావరి ఇసుకకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. నిర్మాణ రంగంతోపాటు, గాజు తయారీ, రంగుల పరిశ్రమలోనూ ఇసుక కీలకపాత్ర పోషిస్తుంది. వందలాది టన్నుల ఇసుకతో కోట్ల ఆదాయం కూడా లభిస్తోంది.

- గోదావరి జిల్లాల్లో చేపల, రొయ్యల చెరువులు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం సుమారు లక్ష ఎకరాల్లో ఈ చెరువులు ఉన్నాయి. చెరువుల్లో ఉప్పు శాతం పెరిగినప్పుడు గోదావరి నీటితో నింపడం ద్వారా ఉప్పు సాంద్రత తగ్గిస్తారు. మత్స్య కారులు గోదావరి నుంచి రొయ్య పిల్లలను సేకరించి అమ్మడం ద్వారా ఆదాయం పొందుతారు.

- వరదల సమయంలో వచ్చే ఎర్ర నీరు చేనుకు చేవనిస్తుందని రైతులు భావిస్తారు. ఆ నీటితోటే నాట్లు పూర్తి చేస్తారు. వరద నీటిలో ఉండే ఒండ్రు మట్టి చేలకు అధిక బలం చేకూర్చుతుంది.

ప్రయోజన గోదావరి

ఒక నది ఎంత మార్పు తీసుకురాగలదో, జన జీవనాన్ని ఎంత ప్రభావితం చేయగలదో– గోదావరి మనకు సజీవ సాక్ష్యం. తెలుగు వారి చరిత్రలో, సంస్కృతిలో అది విడదీయ లేని భాగం. గోదావరి ప్రస్తావన లేకుండా కథ ఉండదు. భాష ఉండదు. చరిత్ర ఉండదు. ఒక నది ఒక పరిపూర్ణపు బతుకు అయినప్పుడు, తరతరాల జీవనానికి వారధి అయినప్పుడు– అది కలకాలం నిలిచే ఉంటుంది. పంటలో, వంటలో, మాటలో, ఆటలో, పాటలో, పదిమందీ నడిచే బాటలో దాని బలమైన ముద్ర స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. జన గోదావరి, ప్రయోజన గోదావరి కావడం వల్లే దానికి అంత ప్రతిష్ఠ! బతుకున బతుకై సాగే విశిష్టత!

పుష్కరాల సంగతులు

- 1895లో పుష్కరాలకు లాంచీలు, పడవలు, స్టీమర్ల మీదే ప్రయాణం చేయాల్సి వచ్చింది. అమలాపురం, రాజమండ్రి నుంచి నదిపై కొవ్వూరు వచ్చి గోష్పాద క్షేత్రం వద్ద పుష్కర స్నానం చేసేవారు.
- 1908 పుష్కరాలకు మొదటిసారిగా పుష్కర యాత్రికులు రాజమండ్రి, కొవ్వూరు మధ్య

వెండితెరపై వెలుగులు

గోదావరి అందాలను చిత్రీకరిస్తూ అనేక సినిమాలు గోదావరి ఇతివృత్తంగా సాగాయి, సాగుతున్నాయి. బాపు, రమణ 1967లో తొలి సారిగా 14 రోజుల్లో తీసిన సాక్షి సినిమా, ఆ తర్వాత తీసిన బుద్ధిమంతులు, అందాల రాముడు, సంపూర్ణ రామాయణం, భక్త కన్నప్ప, ముత్యాల ముగ్గు, మన ఊరి పాండవులు వంటి అనేక సినిమాలు గోదావరి తీరంలోనే తెరకెక్కాయి. అందాల రాముడు మొదట్నుంచీ చివరివరకూ గోదావరిలోనే అద్భుతంగా చిత్రీకరించారు. సంపూర్ణ రామాయణం సినిమాను అరణ్య

'మన ఊరి పాండవులు' ఓ దృశ్యం

ప్రాంతం, గోదావరి పాయల్లో చిత్రీకరించారు. ఇంకా అనేకమంది నిర్మాతలు, దర్శకులు గోదావరి అందాలను వెండితెరపై చూపించారు. ఆదుర్తి సుబ్బారావు 1964లో మూగమనసులు చిత్రం గోదావరి తీరానే తెరకెక్కించారు.

పాటల్లో గోదారి గలగలలు

గోదావరి మీద కొన్ని వందల సినీ గీతాలు వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. 'వేదంలా ఘోషించే గోదావరి/ అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి/ శతాబ్దాల చరితగల సుందర నగరం/ గత వైభవ దీప్తులతో కమ్మని కావ్యం' అంటూ ఆంధ్రకేసరి చిత్రంలో ఆరుద్ర రాసిన గీతం రాజమహేంద్రి ప్రత్యేకతలకు ఒక పరిచయ గీతం. 'ఉప్పొంగెలె గోదావరి.. ఊగిందిలే చేలోవరి/ భూదారిలో నీలాంబరి మా సీమకే చీనాంబరి/ వెతలు తీర్చుమా దేవేరి వేదమంటి మా గోదారి/ శబరి కలిసిన గోదారి రామచరితకే పూదారి' అంటూ గోదావరి చిత్రంలో వేటూరి రాసిన గీతం అద్భుతంగా ఉంటుంది. 'గోదారి గట్టుంది గట్టుమీన సెట్టుంది/ సెట్టు కొమ్మన పిట్టుంది పిట్ట మనసులో ఏముంది/ అం ట రా మూగ మనసులులో ఆత్రేయ రాసిన పాట 50 వసంతాలు నిండినా నేటికీ ప్రజల నోళ్లలో నానుతూనే ఉంది. 'వయ్యారీ గోదారమ్మ ఒళ్లంతా ఎందుకమ్మా కలవరం/ కడలి ఒడిలో.../ అంటూ ప్రేమించు పెళ్లాడు చిత్రంలో సాగే గీతం గోదావరి వయ్యారాన్ని వర్ణిస్తుంది. 'వెన్నెల్లో గోదారి అందం/ నదికన్నుల్లో కన్నీటి దీపం/' సితారలో వేటూరి రాసిన గీతం కూడా ప్రసిద్ధే. ఇంకా ఇలాంటి సినీ గీతాలు ఎన్నో ఉన్నాయి. గోదావరి మీద కథలూ, నవలలు కూడా చాలా వచ్చాయి. కవితలకు అయితే లెక్కే లేదు! జానపద గీతాలు కూడా చాలా ఉన్నాయి. సామెతలూ బోలెడు.

రైళ్లలో ప్రయాణించారు. పాత రైలు వంతెనపై 1900లో రైళ్ల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

- 1944లో జులై 19 నుంచి 30 వరకూ గోదావరి పుష్కరాలు జరిగాయి. అది రెండో ప్రపంచ యుద్ధ కాలం. ఈ పుష్కరాలకు రావటానికి యువకులు భయపడేవారట! కారణం యువకులు కనిపిస్తే- సైన్యంలోకి తీసుకెళ్లిపోయేవారట. రైలు వంతెనను చూసేందుకు వచ్చిన కొంతమంది యువకులను బ్రిటీష్ ప్రభుత్వం బలవంతంగా సైన్యంలో చేర్చిందట కూడా ..
- 1956లో పుష్కరాలకు కొవ్వూరులో విద్యుత్ సదుపాయం కల్పించారు. అప్పట్లో రేడియోలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. రేడియోలో వార్తలు, పాటలు వినడం ఎంతో సరదాగా ఉండేది. సిమెంట్ కూడా వాడకంలోకి వచ్చింది అప్పుడే. కొవ్వూరు, రాజమండ్రిలో సిమెంట్ భవనాలు వెలిశాయి. గ్రామీణ ప్రాంత యాత్రికులకు ఇవన్నీ వింతగా ఉండేవట!
- 1967 పుష్కరాలకు రాజమండ్రిలో విమాన సర్వీసు ఏర్పాటు చేశారు. ఆకాశంలో కొద్దిసేపు విహరించటానికి పెద్దలకు రూ.12, పిల్లలకు రూ.7 ఛార్జి ఉండేది.
- 1979 పుష్కరాలకు మొట్టమొదటిసారిగా సమాచార శాఖ ఆధ్వర్యాన మీడియా సెంటరు ఏర్పాటు చేశారు. వైర్‌లెస్ ద్వారా పుష్కర సమాచారాన్ని అధికారులు సేకరించేవారు. మొట్టమొదటిసారిగా రోడ్డు కం రైలు వంతెనపై బస్సుల ద్వారా, వాహనాల ద్వారా రాజమండ్రి కొవ్వూరు మధ్య ప్రయాణాలు చేసేవారు. లాంచీ సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి.
- 1991 పుష్కరాల సమయంలో గోదావరికి భారీగా వరదలు వచ్చాయి. యాత్రికులు స్నానం చేసేందుకు అవకాశం లేకపోవడంతో గోదావరి జలాల షవర్‌బాత్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఒక రోజులో సుమారు ఏడు లక్షల మంది యాత్రికులు స్నానం చేయడం ఒక విశేషం.
- 2003 పుష్కరాల్లో సుమారు 95 లక్షల మంది పుష్కర స్నానాలు చేశారు.

కరుణే కాదు... కోపమూ ఉంది ...

ఎంతగానో ఉపయోగపడే గోదావరి వరదల సమయంలో ఒక్కోసారి ఉగ్రరూపం దాల్చి గ్రామాలను ముంచేస్తుంది. ఏటిగట్లు తెగిపడి ఆస్తి, ప్రాణనష్టాలు జరుగుతున్నాయి. ఖరీఫ్‌లో ఏటా గోదావరి ఉధృతి రైతులను భయపెడుతూనే ఉంది. 1986లో ఉగ్ర గోదావరి లంకలను, నదీతీరంలో ఉన్న ఊళ్లనూ ముంచెత్తింది. ఏటిగట్టు తెగిపోవడంతో కోనసీమ కల్లోలసీమగా మారింది. దేవీపట్నం మండలంలో గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడాయి. 2006 లోనూ గోదావరి ఉధృతంగా ప్రవహించి లంకవా సులను తీవ్రంగా భయపెట్టింది. వరదల సమయంలో ఏటా ఐదారు టిఎంసిల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. ఒక్క టిఎంసి నీటితో సుమారు 10 వేల ఎకరాలు సాగు చేసే వీలుంది.

(తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజాశక్తి సిబ్బంది సహకారంతో)

✦

పులస .. చీర మేను

గోదావరి వరదల సమయంలో లభించే పులస చేపకు చాలా డిమాండ్ ఉంది. వరదల సమయంలో యానాం నుంచి బయల్దేరిన విలస ధవళేశ్వరం వరకు వచ్చేసరికి పులసగా మారుతుంది. ఈ పులస ధర రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు పలుకుతుంది. గోదావరికి ఎర్ర నీరు రాగానే అరుదుగా దొరికే ఈ పులస కోసం చాలామంది ఆరాటపడతారు. రాజకీయ నాయకులను, ఉన్నతోద్యోగులను ప్రసన్నం చేసుకునేందుకు కొంతమంది ఈ పులసను కానుకగా పంపుతారు.

గోదావరిలో లభించే అరుదైన మత్స్య సంపదలో చీరమేను ఒకటి. గోదావరి ప్రసాదంలా భావించే దీని ఖరీదు కేజీ రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు పలుకుతుంది. గోదావరి సంగమ ప్రాంతాల్లోని అనేక రకాల చేపలు సంతానోత్పత్తి చేస్తుంటాయి. ఇవి వేలు, లక్షల్లో పెట్టే గుడ్ల నుంచి చిన్ని చేపలు బయటకు వస్తాయి. వీటిని పలుచటి చీరతో సేకరించడం వల్ల చీరమేను అని పేరు వచ్చింది. గోదావరి వాసులు చీరమేను పులుసు, ఇగురు పెట్టుకుని ఆరగిస్తారు.

మూడు గుర్రాలు.. మూడు అయిదులు

- డా॥ చింతకింది శ్రీనివాసరావు

"ఏవండోయ్ ధనమ్మగారూ. కోక మాగొప్ప ఫేషనుగా కట్టేరు. మిమ్మల్ని పల్లెటూరోళ్ళని ఎవరనగల్దురు. పట్నం తీసికెళ్లి బ్యూటీపార్లర్లో మీలాంటోళ్ళని కూచోబెడితే చాలు. క్షణాల్లోనే సినిమా హీరోయిన్లయిపోతారు. మీ దగ్గరున్న సోకు ఇంకెవరి దగ్గరుంటుంది." పాలంకి మహేశ్వర్రావు పేట్రేగి పోతూ అన్నాడు. ధనమ్మ అందాల్ని ఎంత వేగిరం జుర్రేస్తే అంతమజా అన్నట్టుగా అన్నాడు. పచ్చని చెట్ల సందుల్లో ఆ అదృష్టం తనకెప్పుడు పడుతుందోననే బులబాటంతో అన్నాడు.

గడ్డి కోసుకుంటున్న ధనమ్మకి ఆ చెత్త మాటలేం కొత్తకాదు. కొన్నాళ్లనుంచీ వింటున్నవే. అందుకే పెద్దగా చలించలేదు.

నాదారోళ్లని చూస్తే జబరుగున్న నాయాళ్ళకి ఇలాగే అనిపిస్తుందని ఆ పిల్లకీ తెలుసు. కానీ ఏం చేయగలదు. భర్త అప్పారావుకీ చెప్పిచూసింది. పెద్దోళ్లతో పోట్లాటెందుకులెద్దూ.. అంటూ ఎప్పటికప్పుడు సముదాయిస్తున్నాడు.

అందుకే.. "ఇలగ ఈడితోటి ఎన్నాల్లు ఏగాలో ఏటో." అంతవరకు కోసిన గడ్డిని బుంగలోకి ఎత్తుకుంటూ మనసులోనే బాధగా అనుకుంది.

తేనెపట్లు కొట్టడంలో అప్పారావు గండరగండడు. ఊళ్లోనూ, ఊరిపక్కన కొండల్లోనూ, పెండెల్లోనూ ఎక్కడ తేనెటీగలు పట్టుపెట్టినా కొట్టుడుకు ముందుండేవాడు. కునుకుతూనయినా నడిచే వీళ్ల బతుకుబండికి కొన్ని నెలలయింది గట్టి దెబ్బ తగిలేసి. ఇంకా చెప్పాలంటే, వైజాగ్ నుంచీ ఎప్పుడైతే మహేశ్వర్రావు దిగాడో అప్పట్నించీ తేనె లాంటి అప్పారావు జీవితం బాగా చేదయి పోయింది.

మహేశుడు సామాన్యుడు కాడు. పెద్దమనిషిలా పైకి కనిపించగలిగేవాడు. పెద్దనోట్లు సంపాదించి నవాడు. పెద్ద కాంట్రాక్టులు చేస్తున్నవాడు. ప్రస్తుతం విశాఖ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో భారీ సెల్‌టవర్లను నిలబెట్టే పనులు పట్టినవాడు. ఆ పనుల మీదనే కందిపూడిలో కుదురుకున్నవాడు.

ఈయనగారు సెల్‌టవర్లమీద సెల్ టవర్లు కట్టిపించడం వల్ల భారతదేశంలో ఎవరికి ఏం లాభం జరిగిందో గానీ, కందిపూడి సహా చుట్టుపక్కల గ్రామాల్లోని అప్పారావులాంటి తేనె సేకరణదారులు మాత్రం నిండా మునిగిపోయారు.

సెల్‌టవర్ల నుంచి వెల్లువెత్తే రేడియేషన్ పుణ్యమాని, ఆ మైక్రో తరంగాల ధర్మమాని తేనెటీగలు అమ్మా అని పిలుపులేకుండా ఛస్తున్నాయి. అయిపు అజ లేకుండా పోతు న్నా యి. వాటి సంతతి అస్స లు పెరగడం లేదు. తేనెటీగలే లేనప్పుడు తేనేపట్లె క్క డివి. వా టిని పిండి కడుపు నింపు కునే సులువె క్క డిది.

అలా తేనెటీగ కనబడక తల్లడిల్లిపోతున్న అప్పారావు కుటుంబానికిప్పుడు పేడపురుగులా తగులుకున్నాడు మహేశ్వర్రావు. చీటికీ మాటికీ ఇంటికి రావడం. తబరకాగా మాటాడ్డం. ధనమ్మ అంత గ్రహించలేనిదేం కాదు. అప్పారావుకీ వాడి దుర్మార్గం తెలుసు. తన కోసం అన్నట్టుగా వస్తాడేగానీ, చూపులన్నీ ధనమ్మమీదేననీ తెలుసు. ఆ రోజూ ఎప్పటిలాగానే ఇంటికి వచ్చి వికటాలాడి వెళ్లాడు ఆ తుంటరి. మరిక నోరు మూసుకుని ఉండలేకపోయింది ధనాలు.

"ఏటి మావా. ఈడిగోల. పొద్దున్నే ఈ ఎదవ సంతేటి. సూసీ నోల్లు ఏటనుకుంతారు. నీకు మాట. నాకుమాటానిపోరంబోకెదవ."తాచులా లేచింది.

"నిజవేనే. ఈడు కల్జుగాడేను. తెల్దంటావేటి. ఏటి సేత్తాం. ఆడు పెద్దోడు. డబ్బునోడు. ఆడికి పోలీసులు తెలుసును. ఆఫీసర్లు తెలుసును. లీడర్లు తెలుసును. మనకొవుడు తెలుసునే. దేనికయినా టయిం రావాలి. పాపం పండీయాలి. ఎంతమందిర్ని మనం సూన్నేదు." ధనమ్మకి సర్దిచెప్పాడు అప్పుడు.

సరిగ్గా ఆ మర్నాడు సాయంత్రమే, గోర్జి సక్కన గడ్డి గోక్కుంటున్న ధనవమ్మ దగ్గరికి మహా తమకం మీద చేరాడు మహేశ్వర్రా వు. ఆ రోజు ధనాల్తో

◆ కథ

ఏదో ఒకటి తేల్చుకోవాలన్న ఆత్రుత మీదే వచ్చాడు."ఏం ధనమా. ఎందుకే నీకీ పాట్లు. నేనేం టెంపరరీ కాదే. పెరమనెంటేనే. మీకా కూలిపన్లులేవు. ఈగల్లేవు. తేనె లేదు. తిండీ తిప్పలూ లేవు. ఎండిపోయి దోస వొరుగుల్లా అయిపోతున్నారు. ఎందుకే కట్టుబాట్లు. అప్పారావుగాడితో ఉండు. నాతోనూ ఉండు. నీకేంటి కావలిస్తే అదిస్తాను. నేనెక్కడికెళ్లినా వారానికో పది రోజులుకో వచ్చివాలిపోతుంటాను. మూడో కంటికి తెలీనివ్వను." మహేశ్వర్రావు కామా ఫుల్‌స్టాప్ లేకుండా వాగాడు. కామానికీ ఫుల్‌స్టాప్ లేకుండా వాగుడు. కిచకిచ మంటూ నవ్వాడు. ధనవమ్మలో దుఃఖం ఎగిసిపడింది. అప్పటికే ఆ తెంపరికి ఎంతగా అడ్డుకట్ట వేయాలో అంతగానూ చెప్పిచూసింది. అయినా ఆగడే. ఏం చేయగలగుతుంది. వలవలా ఏడ్చింది.

కళ్లనీళ్లు చూసి కదిలిపోయే మనిషి కాదు మహేశ్వర్రావు.

'ధనాలూ, నేనూ నీలాగ మడి కట్టుకుంటే ఇంతవరకూ వస్తానా చెప్పు. నీలాగే ఉంటే, నా మెళ్లోకి గోల్డ్ చెయిన్లు, చేతికి మండ గొలుసులు, వేళ్లకి ఉంగరాలు వచ్చేవా. చిన్నోళ్లమే పెద్దోళ్లం అవ్వాలి. దానికి మన దగ్గరేదుంటే అది ఉపయోగిం చేయాలి. నన్ను చూడు. సివిల్ పనుల్లో ఓనాడు ఇటుకలెత్తేవాణ్ని. రాళ్లు మోసేవాణ్ని. మూడు గుర్రాల అణాకాణీ బీడీలు కాల్చేవాణ్ని. మెట్టూ మెట్టూ ఎక్కేను. అడ్డొచ్చినవాడినల్లా తొక్కేను. ఇప్పుడు చూడు. మూడు గుర్రాల నుంచీ మూడు అయిదుల సిగరెట్టుకి పెరిగేను. త్రీహర్సెస్ టూ త్రిబుల్‌ఫైవ్ అన్నమాట." ఫేంటు జేబులోంచి సర్రున ఖరీదయిన సిగరెట్టు పెట్టె బయటికి లాగి చూపించాడు. అందులో ఒకటి తీసి వెలిగించాడు. గాఢంగా పొగ పీల్చాడు. రింగు రింగులుగా ఆకాశంలోకి వదిలాడు. సిగ్గూబొగ్గూ లేకుండా మళ్లీ అందుకున్నాడు

తన్నుకొస్తున్న కంటినీటిని ఆపుకుంటూ గడ్డిబుంగ నెత్తికెత్తుకుంది ధనమ్మ. ఊరికి దూరంగా విసిరేసినట్టుండే కమ్మలపాకవైపు భయం భయంగా పయనమైంది.

"ఎంత కసకంత్రీ ఎదవో ఈడు. ఆడదంటే ఊడికి అంత అలుసుగున్నాది. మన దయిద్రం ఈడికి వొరం నాగయికూకుంది. ఈడు మూడు గుర్రాల బీడీ కాలిత్తే నాకేటి. మూడయిదుల సిగరెట్టుముక్క ఎలిగిత్తే నాకేటి. ఈడి సంగతి మాతరమా సూసేవాలిసిందే." దీక్ష పట్టేసింది.

ఇంటి ముంజూర్లోనే గడ్డిబుంగ వొంపేసి, గోలెంలో నీళ్లతో ముఖం కడుక్కుని, చీరచెంగుతో తుడుచుకుంటూ తలుపుతీసి పాకలోకెళ్లింది. వెళుతూ వెళుతూనే లోపల మంటి గోడకి తగిలించిఉన్న వెంకటేశ్వరస్వామి అట్టముక్కకి దండం పెట్టుకుంది. తన కష్టాలు తీర్చాలంటూ భగవంతుణ్ని ప్రార్థించింది. పక్కనే ఉన్న కిటికీలోంచి బయటకి యథాలాపంగా చూసింది. అప్పుడు కనబడిందో దృశ్యం. అది ఆ పిల్లకు ఎంత సంతోషాన్నిచ్చిందో చెప్పలేం.

పెళ్లయిన కొత్తలనాడు ఇంటి పక్క జాగాలో స్వయంగా తను పాతిన పనసమొక్క ఆమెకు అగుపించింది. ఇప్పుడది పెరిగింది. చెట్టయింది. కొమ్మలూ దించుకుంది. ఈ ఏడాది పిందెలూ పెట్టింది. అదంతా ఆమెకి సంబరమే. అంతకంటే ఆనందం మరొకటుంది. సరిగ్గా కిటికీ వైపు తిరిగిన ట్టుండే ఆ చెట్టుకొమ్మకే చిన్నపాటి తేనెపట్టు కనిపించింది. ఆ పట్టు ధనమ్మకి తెగ ముద్దొచ్చేసింది. ఆ ఈగలే కదా నిన్నమొన్నటి దాకా తమను పోషించాయన్న భావన రావడంతో ఉక్కిరిబిక్కిరయిపోయింది.

"అబ్బ. ఎన్నాల్లయిందో పట్టు సూసి. నాను బెంగపడిపోతన్నానని ఈగలే దయతలసినట్టున్నాయి. నా కల్లముందే పట్టు పెట్టేనాయి. ఎంత బాగున్నాదో. మావ సూత్తే సేనా ఇదయిపోతాడు." ధనమ్మ పూర్తిగా ఇలా అనుకొనేలేదు.

❑ ❑ ❑

ఎప్పటిలాగానే ఆ వేళ ఉదయాన్నే కూలిపనులకు పోయాడు అప్పారావు. గడ్డికోసం బయలుదేరాలనుకుంది ధనమ్మ. గోర్జి దారి మనసులోకి వచ్చిందో లేదో మహేశ్వర్రావు దుర్మార్గతే గుర్తుకొచ్చింది. తనెక్కడికి వెళితే అక్కడికే వచ్చేసి నసపెడు తున్నాడు. వీణ్ని ఎలా వదిలించుకోవాలో అనేది ఇప్పుడామెకో అగ్నిపరీక్ష.

ఆలోచిస్తూనే వాకిట్లో పందిరిగుంజకి తగిలించిన గడ్డిబుంగ అందుకుంది. ఆ అందుకోవడంలో ఆమె దృష్టి దాపునే ఉన్న పనసకొమ్మవైపు మరోసారి మళ్లింది. తేనెటీగలు కాకరబీకరగా పట్టుమీద తిరగడం చూసింది. తదేకంగా చూసింది. కన్నార్ప కుండా చూసింది. చూపుతిప్పకుండా చూసింది. దృష్టిని నిలిపి నిలిపి మరీ చూసింది. వెనువెంటనే, ఆమెకేదో తట్టినట్టయింది. ఆ తట్టిందేదో తనకు మదేలుచేసేదనని ఆమె మనసు గట్టిగా చెప్పింది. ఒకరకమైన ఉద్వేగం, ఉత్సాహం, పట్టుదల మిళితమైన హృదయంతో వడివడిగా నడక మొదలెట్టింది. నిమిషాల్లోనే గోర్జి చివరికి వచ్చేసింది. అక్కడ పూటుగా పెరిగిన గడ్డి కనిపించింది. కోయడం మొదలెట్టింది. రోజూలా కాదు. ఆవేళ ఎందుకో భలే హుషారుగా గడ్డి కోస్తోంది. ఇంకా ధాటీగా నాలుగు పుంజీళ్ల కొడవళ్ళు పడనేలేదు. చుక్కతెగిరాలినట్టు ఊడిపడ్డాడు మహేశ్వర్రావు.

వచ్చిందే తడవుగా.."ఏం చేశావు నాకథ. నన్నిప్పుడేం చేయమంటావు." కొంచెం విసుగ్గానూ, మరికొంచెం తత్తరింపుగానూ నోరుపెట్టుకుని పడిపోయాడు. వేళ్ల మధ్య చివరిదాకా కాలిన సిగరెట్టుపీక పారేసి విరగబడిపోయాడు.

ఎప్పటిలా కాకుండా ఆ సమయంలో మహేశ్వర్రావును చూసి ధనాలు సిగ్గుమొగ్గయిపోయింది. తెగామగా వాలు చూపులు చూసింది. గోముగా నయనాలు చిట్లించింది. ముసిముసిగా నవ్వింది.

మహేశుడు ఆశ్చర్యపోయాడు. ఆనక తడబడిపోయాడు. ఆ మీదట కిందాతమీదా అయిపోయాడు. తనను చూస్తే నిన్నటి వరకూ ఫెళఫెళలాడిపోయే గుంట.. ఈ రోజు ఇంత ఇమ్ముగా అయిపోతోందేంటబ్బా.. అనుకున్నాడు.

"ఏంటీ. ఇన్నాళ్లకి దయగలిగిందా." త్రిబుల్‌ఫైవ్ వెలిగించి, గుండెలనిండా పొగపీల్చి, కులాసాగా ధనాలవైపు తిరిగి కిసుక్కుమన్నాడు.

"మీకంతా తొందరే బావ్. తవరు రమ్మన్నెంటనే బారుగ వచ్చీగల్దునేటి. పెల్లయినదాన్ని. మీరు అర్థం సేస్కోవాలి. మా మావ పాకలో ఉన్నాడో నేదో సూడొద్దేటి. ఇన్నాల్లకి ఆ బావు పట్నవెల్లేడు. నాక్కుదిరింది. విదీ సంగతి. ముందు నాను బయలెల్తాను. తవరు డైరెక్టుగా విప్పుడే పాక్కాడికి ఎలిపోచ్చీండి." ధనాలు అటూ ఇటూ చూసుకుంటూ స్వరం తగ్గించి పలికిన పలుకులకి పొంగిపోయాడు మహేశ్వర్రావు.

తన కోరిక నెరవేరబోతోందని కసాబిసా అయిపోయాడు.

మరిక ధనవమ్మ అక్కడాగలేదు. పాకలో అడుగుపెట్టింది.

ఆమె మనసంతా కంగారు కంగారుగా ఉంది. ఆమె మెదడంతా గాభరా గాభరాగా ఉంది. ఆమె శరీరమంతా జ్వరం వచ్చినట్టుగా సలసలలాడిపోతోంది. మరోవైపు చెమటలూ పట్టేస్తున్నాయి. అయినా తమాయించుకుంటోంది. తత్తరపాటును కనపడనివ్వడం లేదు. ఇంతలోనే పిల్లిలతా వేంచేశాడు మహేశ్వర్రావు. వాకిట్లోని ఆనపపందిరి దాటేసి ఇంట్లోకి ప్రవేశించబోతున్నాడు. తనకు దక్కబోయే అందచందాలను బహుబాగా ఊహ చేసుకుంటున్నాడు.

ఈలోగా తనే పాక బయటకు ఉన్నపళంగా వచ్చేసింది ధనవమ్మ. వస్తూనే, ఓసారి మహేశుడి చెయ్యిపట్టుకుని వదిలేసింది సుతారంగా. ధనాలు చెయ్యి తగిలీసరికి ఏదోలా అయిపోయాడు మహేశయ్య. మెల్లగా అతగాణ్ని పాకపక్కనే ఉన్న పనసచెట్టుకిందికి అడుగులో అడుగువేసుకుంటూ తీసుకువచ్చింది.

"ఈ సెట్టు నాను పాతిందే బావూ." ఈ మోస్తరుగా ఏదో చెప్పబోయింది.

"అవన్నీ ఇప్పుడెందుకే." విస్సాటంగా అనాలనుకున్నాడు మహేశ్వర్రావు.కానీ, ఇలాంటి సమయంలో ఎదరి మనుషులను వినడం వల్ల మహాలాభాలు దొరుకుతాయన్న అనుభవం గతంలో అతనికుంది. అంచేతే కిమ్మనలేదు.

"బావూ. ఇద్దరమూ ఎండలో నడిసొచ్చీనాం. ఈ పనస సెట్టుకింద సల్లగా ఒక నిమేటు నిలపడండి.

సిగరెట్టు కాలుత్తా ఉండండి. నానింట్లోకెల్లి సీర మారుసుకుని పిలుత్తాను. పారొచ్చీండి." లోగొంతుతో అంది.

చీర మార్చుకుంటాను.. అనే ఆమె మాట మహా రమ్యంగా వినిపించింది మహేశుడికి.

"అలాగే. అలాగే." అన్నాడు వేడివేడి శ్వాసలతో.

వెంటనే అతగాణ్ని పనస కిందే వదిలిపెట్టి గుడిసెలోకి నింపాదిగా చేరుకుంది ధనాలు.

ఇంట్లోకొచ్చిన ధనమ్మ కర్రపెట్టెలోంచి కొత్త కోక బయటకి తీసింది. దాన్ని కట్టుకోబోతూ కిటికీ దగ్గరసా వెళ్లింది. కిటికీలోంచి మహేశ్వర్రావు కనిపిస్తున్నాడు. అతగాడికీ ఆమె కనిపిస్తోంది. కవ్విస్తోంది.

"బాబూ. ఏటింకా సిగరెట్టు ముట్టించనేదేటి. సూడాల్నుంది. నాలుగు దమ్ములు గబాగబా నాగిండి. నోట్లో సిగరెట్టుంతే తవరు మహరాజు కొడుకు నాగుంతారను. సూడముచ్చటగుంతాది. కంటికింపుగుంతే మనసుకింపుగుంతాది మరి." కట్టుకోబోతున్న చీరను కిటికీ లోంచే చూపిస్తూ అదోలా అంది.

"దీని సిగతరగ. నన్ను మొత్తం దోచీసేటట్టే ఉంది. నా వ్యవహారమంతా పట్టేసింది. విసుక్కుంటోందంటే ఏంటో అనుకున్నాను. అదంతా నామీద మోజేనన్నమాట. సరేలే. దీని మాట ఎందుకు కాదనడం. ముందు సిగరెట్టు సంగతి, తర్వాత దీని సంగతీ చూసెద్దాం." మనసు స్థిరం చేసుకున్నాడు మహేశయ్య.

అదే తడవుగా జేబులోంచి త్రిబుల్ ఫైవ్ ప్యాకెట్ బయటకు తీశాడు. అగ్గిపెట్టె తీశాడు. సిగరెట్ నోట్లో పెట్టుకుని విలాసంగా అగ్గిపుల్ల గీశాడు. అంటించాడు. ధనాలవైపు చిత్రంగా చూపులు సారించాడు. ఆ పిల్ల ఇంట్లోనుంచే ముసిముసి నవ్వులు నవ్వుతుండగా సిగరెట్టు పొగ గట్టిగా పీల్చాడు విలాసంగా. పీల్చిన పొగనంతా అలవాటు ప్రకారం మోరమీదికెత్తి ఉఫ్‌మంటూ బలంగా గాల్లోకి వదిలిపెట్టేశాడు. అచ్చం అలానే ఇంకో దమ్ము. వెనువెంటనే మరో దమ్ము. ఇలా ఒకదాని వెంట మరొకటిగా పీలుస్తూనే ఉన్నాడు. పైపైకి ఊదిపారేస్తూనే ఉన్నాడు.

మహేశుడి గొట్టం నోటంట బయటపడుతున్న పొగ ఒకటిరెండు పనసాకుల్ని దాటుకుంటూ సూటిగా వెళ్లాల్సిన చోటుకే వెళ్లింది. తగలాల్సిన చోటే తగిలింది. ఇంతకీ అది ఎక్కడికి వెళ్లిందంటేను.. తమ పనేదో తాము చేసుకుంటూ పనసకొమ్మ పట్టుమీద తిరుగులాడే తేనెటీగలపైకి వెళ్లింది.

ఉన్నట్టుండి సిగరెట్టు పొగ దిట్టంగా తగిలేసరికి తేనెటీగలన్నీ లజ్జుగుజ్జులు పడిపోయాయి. లబలబలాడిపోయాయి. అనుకోని ఆపద చుట్టుముట్టేస్తోందని వెర్రెత్తిపోయాయి. ఎవడో తమ ప్రాణాలమీదికి ఏదో తెచ్చేస్తున్నాడన్న బెంగతో చెలరేగిపోయాయి. తమను నాశనం చేయాలను కుంటున్నది మహేశ్వర్రావేనన్న నిర్ణయానికి చిటికెలోనే వచ్చేశాయి. అంతే. పట్టునొదిలేసి దండుదండుగా దాడి మొదలెట్టేశాయి.

ఈ హఠాత్



ఘటనకు బెంబేలె త్తిపోయాడు మహేశ్వ ర్రావు.తను అనుకున్న ట్టుగానే అంతా జరిగిందని కిటికీలోంచి చూస్తున్న ధనాలు పొంగిపోయింది. ఉప్పొంగిపోయింది. వెంటనే చేతిలో ఉన్న కొత్త చీరను పెట్టెమీదికి విసిరేసింది. కిటికీకున్న రెండు చెక్క రెక్కలూ మూసేసింది. చిడతలు పెట్టేసింది. అప్పటికే పాక పెరటి ద్వారం, వీధి తలుపు కూడా లోపలికి గొళ్లాలు వేసి పెట్టింది.

పాక బయట మహేశుడు విలవిల్లాడిపోతు న్నాడు."బాబోయ్ తేనెటీగలు చంపేస్తున్నాయ్. తల్లోయ్ తేనెటీగలు పొడిచేస్తున్నాయి. నాయనోయ్ రక్షించండి. దేవుడోయ్ కాపాడండి." కేకలేస్తూ మొత్తుకుంటున్నాడు.

అప్పటికే ఈగలన్నీ వాణ్ని చుట్టేశాయి. ఎడాపెడా కుట్టికుట్టి పోగులు పెడుతున్నాయి. తాళలేని స్థితిలో పాక తలుపు కొట్టాడు. తెరవాలంటూ ధనమ్మను చాలా బతిమిలాడాడు. కిటికీ దగ్గరికీ వచ్చాడు.

"ధనాలూ దణ్ణం పెడతానే. ధనాలూ దయ చూపించవే." అరిచి అరిచి గీపెట్టాడు. గీపెట్టి గీపెట్టి అరిచాడు.పాక లోపల ధనాలు కేళీగా నవ్వింది. తుళ్లతూ నవ్వింది. చిందులేస్తూ నవ్వింది.

"దొంగ లమిడీ కొడకా. పేదాసాదా నీ పెల్లాలనుకున్నావేట్రా. కనిపించిన ఆడదాన్నల్లా దోసెత్తావేట్రా. తప్పుడు నాకొడకా. అప్పుడెప్పుడో మూడు గుర్రాలు కాల్చినావు గదా. ఆ గుర్రాల్నే పిలుసుకో. ఆటి మీదే ఊరేగిసి ఈగల్ని తప్పించీస్కో. ఇప్పుడు తెగ బలిసీసి మూడు అయిదులు కాలుత్తున్నావేమో. ఆటితోనే ఉరుసుట్టూ మంటేసీసుకుని ఈగల్ని తప్పించుకోవో." తీవ్ర స్వరంతో అరుస్తున్నట్టుగా అనేసింది. బయటనుంచి తలుపు ఎవరు ఎంతలా బాదినా ఊడిరాకుండా లోపలనుంచి దాని బందుల్ని బలంగా పట్టుకుని నిలుచుం డిపోయింది.

ధనాలు కొంపముం చేసిందని మహేశ్వర్రావుకి అప్పుడిక అర్థమైపోయింది. పథకం ప్రకారమే తనను తేనెటీగలకు ఎరగా వేసిందనీ బోధపడి పోయింది. చేసేదిలేక, ముసురుకుంటున్న తేనెటీగలను తప్పించుకోలేక, వాటి కాట్లకి తట్టుకోలేక పాక వదలిపెట్టి పరుగులు మొదలెట్టాడు. వాడెంత పరుగెడితే ఈగలు అంతలా పగతీర్చుకున్నాయి. వాడి బలం మొత్తాన్ని లాగేశాయి. కళ్లల్లోనూ, నాలికమీద కూడా కుట్టేసి కొండెలు దింపేశాయి.

నిస్త్రాణ కమ్ముకురావడంతో మహేశ్వర్రావు ఎక్కువ దూరం దౌడు తీయలేకపోయాడు. పక్కనేఉన్న వేరుశనగ గరువుమీద అడ్డంగా పడిపోయాడు. అయినా, తేనెటీగలు వదిలిపెట్టలేదు. వేలాదిగా వాలి కసితీర్చుకున్నాయి.

అతగాడి అరుపులకి ఎక్కడెక్కడో పొలాల్లో పనిచేసుకుంటున్న కూలీలు ఆలస్యంగానయినా అక్కడికి చేరుకున్నారు. ఎండిన తాటి మట్టలు ఏరుకొచ్చారు. పెద్ద పెద్ద మంటలు పెట్టారు. వాటితో ఈగల్ని ఎలాగయితేనేం చెదరగొట్టగలిగారు. ఒంటి మీద స్మారకంలేకుండా పడున్న మహేశ్వర్రావును ఎడ్లబండి తెచ్చి అందులో వేశారు. పక్కఊరి ఆసుపత్రికి పట్టుకుపోయారు. అప్పటికే, పనసకొమ్మమీద పట్టుపెట్టిన తేనెటీగలు ఎక్కడికో ఎగురుకుంటూ పోయాయి. మహేశుడి ప్రాణాలూ వాటితో పాటే ఎటో ఎగిరిపోయాయి. ✦

ఆలూ సూప్

కావాల్సిన పదార్థాలు

బంగాళదుంపలు- 1/4 కిలో,
ఉల్లిపాయలు-2 పెద్దవి
పచ్చి మిర్చి-3 కాయలు, చింతపండు-50.గ్రా.
నూనె, పసుపు, ఉప్పు, బెల్లం- తగినంత,
వెల్లుల్లిపాయ- 1, మెంతులు-1/2 చెంచా
కారం- 1 చెంచా, తాలింపులు-తగినంత,
కరివేపాకు-తగినంత

తయారీ విధానం:

చింతపండు కడిగి నీటిలో నానపెట్టాలి. బంగాళదుంపలు, పచ్చి మిర్చి, ఉల్లిపాయల్ని చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. గిన్నెలో నూనె పోసి కాగిన తర్వాత వెల్లుల్లి చిదిపి వేయాలి. తరువాత మెంతులు వేసి వేగాక తాలింపులు కరివేపాకు వేసి వేగిన తర్వాత తరిగిన ఉల్లి, దుంప, మిర్చి ముక్కలు కూడా వేసి కాస్త వేగిన తర్వాత చింతపండు రసం చిక్కగా చేసి పోయాలి. ముక్కలనీ ఉడికిన తర్వాత ఉప్పు, పసుపు, కారం కూడా వేసి బాగా మరగనిచ్చి కొత్తిమీర చల్లుకొని దింపుకోవాలి.

చైనీస్ సూప్

కావాల్సిన పదార్థాలు

వెజిటబుల్ స్టాక్- 4 కప్పులు
పుట్టగొడుగులు- 1/2 కప్పు
బేబీకార్న్ ముక్కలు- 1 కప్పు
ఉప్పు - తగినంత
నూనె- 1 స్పూన్, సోయా సాస్- 2 చెంచాలు, వెనిగర్- 2 చెంచాలు

తయారీ

ముందుగా దళసరి గిన్నెలో వెజిటబుల్ స్టాక్‌లో పుట్టగొడుగులు , బేబీ కార్న్, క్యారెట్ ముక్కలు వేసి కాసేపు మరగబెట్టాలి. తరువాత ఉప్పు వేసి కలపాలి. చివరగా సోయా సాస్, వెనిగర్ కలిపి సర్వ్ చేయాలి.

టమాటా సూప్

కావాల్సిన పదార్థాలు

టమాటా-250 గ్రాములు, కార్న్ ఫ్లోర్- 2 టేబుల్ స్పూన్స్, మిరియాల పొడి-1/2 టీ స్పూన్, ఉప్పు - తగినంత

తయారీ

ఈ సూప్ కోసం హైబ్రీడ్ టమాటాలు తీసుకోవాలి. గుజ్జు ఎక్కువగా ఉంటుంది. గ్లాసుడు నీళ్ళు పోసి టమాటాలను పది నిమిషాలు ఉడికించాలి. చల్లారాక ముక్కలు చేసి గ్రైండ్ చేయాలి. ఇది వడగట్టుకోవాలి. పాన్ వేడి చేసి ఈ టమాటా రసం పోసి మరిగించాలి. మరుగుతుండగా ఉప్పు, మిరయాల పొడి వేయాలి. కార్న్ ఫ్లోర్ అర కప్పు నీళ్ల పోసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. మరుగుతున్న టమాటా రసంలో ఈ కార్న్ ఫ్లోర్ మిశ్రమం వేసి ఉండలు కట్ట కుండా కలుపుతూ ఉండాలి. రెండు నిమిషాలు మరిగిన తర్వాత దింపేసి వేయించిన బ్రెడ్ ముక్కలు కాని, కొత్తిమీర కాని వేసి వేడిగా సర్వ్ చేయాలి.

స్వీట్ కార్న్ సూప్

కావాల్సిన పదార్థాలు

స్వీట్ కార్న్-కప్పు, ఉల్లి కాడలు-అర కప్పు, కూరగాయలు ఉడికించిన నీళ్లు-మూడు కప్పులు, టమాటా సాస్-ఐదు చెంచాలు, దాల్చిన చెక్క-కొద్దిగా, జీలకర్ర -చెంచా, మిరియాలు- చెంచా, ఉల్లిపాయ తరుగు -అర కప్పు, టమాటా-ఒకటి, పచ్చి మిర్చి-నాలుగు, ఉప్పు, పంచదార- తగినంత

తయారీ

ముందుగా ఉల్లిపాయ, టమాటా, పచ్చి మిర్చి ముక్కలు తరిగి మిక్సీలో వేసి ముద్దగా చేయాలి. అలానే శుభ్రంగా ఉన్న వస్త్రంలో దాల్చిన చెక్క, జీలకర్ర, మిరియాలు తీసుకొని మూటలా కట్టాలి. ఉల్లిపాయ ముద్ద, సుగంధ ద్రవ్యాల మూట, మొక్క జొన్నలను కూరగాయలు ఉడికించిన నీళ్లలో వేసి పొయ్యి మీద పెట్టాలి. కొద్దిసేపటికి ఉప్పు, ఉల్లి కాడలు, టమాటా సాస్ వేసి బాగా మరిగించాలి. సూప్ చిక్కగా అవుతుంది. అప్పుడు సుగంధ దినుసుల మూటను తీసేసి వేడివేడిగా చాలా రుచిగా ఉంటుంది.

చుక్కలు కలిపేద్దాం



మొత్తం ఎన్ని ?

పిల్లలూ మీకు జంతువులు అంటే చాలా ఇష్టం కదా అయితే మీకోసం ఓ చిన్న పరీక్ష. ఈ ఏనుగులో ఎన్ని జంతువులు దాక్కున్నాయో గుర్తించి చెప్పాలి.



దారి కనుక్కోండి

చూసి గీయండి

ఇవాళ ఎలుక బొమ్మ వేయడం నేర్చుకుందాం. అంతటితో ఆగిపోకండి. ఈచిట్టి ఎలుకకు రంగులు వేసేయండి



ఏమేం ఉన్నాయి?

ఈ చిత్రంలో ఓ వింత జీవి వుంది. కాకపోతే అందులో మొత్తం రెండు జీవుల శరీర భాగాలున్నాయి. వాటిని గుర్తించి చెప్పండి.

పదాలు వెతుకుదాం

ఇక్కడ పూలకు సంబంధించిన ఏడు పేర్లు ఇంగ్లీషులో ఇచ్చాం. అక్షర సమూహంలో అవన్నీ వున్నాయి. అడ్డంగా, నిలువుగా, వంకరగా ఎలాగైనా వుండొచ్చు. వాటిని గుర్తించి సున్నా చుట్టండే.



pink bee sun blue
petal stem leaf

పది తేడాలు గుర్తించండి

అందాల నెమలి వివిధ రకాల వస్తువులను ఒక చోటికి చేర్చి వాటిని అమ్మదలచింది. అయితే అచ్చం తనలాగే ఉన్న మరో నెమలి కూడా అక్కడికి వచ్చింది. వీటి మధ్య పది తేడాలు ఉన్నాయి. వాటిని గుర్తించండి.

పిగ్మీ ఏనుగు

ఏనుగులు చాలా లావుగా ఎత్తుగా ఉంటాయి కదా. కానీ బోర్నియోలోని ఏనుగులు చాలా తక్కువ ఎత్తుతో ఉంటాయి. ఎంచక్కా పెద్దోళ్లు నించుని వాటిపైకి మిమ్మల్ని ఎక్కించేయొచ్చు. పెద్దవి కూడా చిన్న పిల్లల ముఖాలతో ముచ్చటగా ఉంటాయి. పెద్దగా అరుస్తూ భయపెట్టే మన ఏనుగుల్లా కాకుండా వాటికి మనుషులతో ఉండటం సరదా. వాటి గురించి మరిన్ని వివరాలు తెలుసుకోండి.

- మలేషియాలోని సాబా అటవీ ప్రాంతం, ఉత్తర బోర్నియోలో, ఇండోనేషియాలోని కాళీమంతన్‌లో ఇవి జీవిస్తాయి.
- అంతరించిపోయే దశలో ఉన్న వీటిని కాపాడేందుకు అంతర్జాతీయ జంతు సంరక్షణ సంఘాలు పనిచేస్తున్నాయి.
- అన్ని ఏనుగుల కంటే చిన్నగా ఉండే ఇవి చిన్న పిల్లల ముఖాల్ని కలిగి ఉంటాయి.
- మనుషులతో తేలిగ్గా కలిసిపోతాయి. ఆఫ్రికా, ఆసియా ఏనుగుల్లా కాకుండా శాంత స్వభావం కలిగి ఉంటాయి.
- వీటి పిల్లలు మన నడుం ఎత్తుకు ఉంటే, పెద్దవి 7 నుంచి 9 అడుగులు ఉంటాయి.
- ఇవి ప్రత్యేకమైన జాతి ఏనుగులని పరిశోధకులు తేల్చారు.
- 1757లో సుల్తాన్ షులూకు ఈస్ట్ ఇండియా కంపెనీ కొన్ని పొట్టి ఏనుగుల్ని బహుమతిగా
- ఆ కాలంలో రాజులకు, పెద్దలకు ఏనుగుల్ని బహుమతిగా ఇవ్వడం సంప్రదాయం.
- ఆఫ్రికా జాతి వాటిలా ఆడ ఏనుగులకు పొడవాటి దంతాలు ఉండవు.
- వాటి నివాస ప్రాంతం 250 – 400 చదరపు కిలోమీటర్లు ఉంటుంది.
- అడవుల నరికివేత, వేటగాళ్ల వల్ల వీటి మనుగడ ప్రమాదంలో పడింది.
- 2005 లెక్కల ప్రకారం 1184 – 3652 వరకు ఇవి ఉండొచ్చని అంచనా.
- పొలాల్ని ధ్వంసం చేస్తున్నాయని వీటికి విషం ఇచ్చి చంపుతున్న ఘటనలు ఎక్కువవుతున్నాయి.
- వీటిని పిగ్మీ ఏనుగులని పిలుస్తారు.
- ఎండాకాలం, వర్షాకాలాల్లో అవి ప్రమాదం లేని, ఆహారం దొరికే ప్రాంతాలకు వెళ్లిపోతాయి.
- ఏనుగుల గుంపులో పెద్దవి ఆ దారిని గుర్తుంచుకుని మిగతా వాటిని తీసుకెళతాయి.
- చిన్న పిల్లల్ని గుంపులోని ఆడ ఏనుగులు ప్రేమగా చూసుకుంటాయి. వాటిని జాగ్రత్తగా కాపాడతాయి.
- తల్లి సంరక్షణలో 5 ఏళ్ల వరకు ఉన్న తర్వాత మగ ఏనుగులు వాటి ఇష్టానుసారం వేరేగా బతుకుతాయి. ఆడవి గుంపుతోనే ఉంటాయి.

అలనాటి రష్యన్ కథలు

ఇవి రష్యన్ సాహిత్య కథలు. 1910 ప్రాంతంలో రాసినవి. చాలా వరకు బాల సాహిత్య కథలుగా ఉంటాయి. బాల మిత్ర, చందమామ కథలుగా అనిపిస్తాయి. కొన్ని పంచతంత్ర కథల్ని గుర్తుకు తెస్తాయి. పాఠకులచే కన్నీరు పెట్టించే యదార్ధ కథ "గిఖోర్". రైతు హంబో తన 12 సంవత్సరాలు గిఖోర్ (కొడుకు) ని పట్నంలో ఉద్యోగంలో పెట్టడం ,బజాజ్ అర్తేం ఇంట్లో గిఖోర్ పని చేస్తూ ఉండటం, చలికాలం తట్టుకోలేక గిఖోర్ జబ్బుపడి మరణిం చడం అతన్ని పాతిపెట్టే హంబో (తండ్రి) చంక కింద గిఖోర్ బట్టలు పెట్టుకుని వాడి తల్లి చూసు కుని కడుపు నిండా ఏడవడానికి తీసుకు వెళ్ళడం, వాడి జేబులో మెరుస్తున్న బొత్తాలు, రంగు రంగుల కాగితం ముక్కలు, పిన్ను సూదులూ, బట్టల తాన్ల పీలికలూ ఉన్నాయి. గిఖోర్ ఇవన్నీ చెల్లెలు కోసం పోగు చేశాడు. గిఖోర్ వచ్చావా! రా!రా అన్న గిఖోర్ తల్లి పిలుపుతో కథ ముగుస్తుంది. ఇది 1894 లో రాసిన కథ. పట్నంలో షావుకార్లు బాల కార్మికుల్ని.... వారి శ్రమను దోచుకున్న వైనం చెప్పే కథ. అలాగే చివరి కథ "తోక తెగిన నక్క" కథ కూడా గ్రామంలో ఉన్న శ్రామిక వర్గాన్ని ముఖ్యంగా ఉత్పత్తి కులాల జీవన దృశ్యాన్ని చెప్పే కథ. ఏడు చేపల కథను గుర్తుకు తెస్తుంది. నక్క ముసలమ్మ పితికిన మేక పాల చెంబులోని పాలు తాగడంతో ముసలమ్మ గొడ్డలితో నక్క తోక నరికి వేస్తుంది. తన తోక ఇవ్వాలంటే ఆవు పాలు తెమ్మని ముసలమ్మ నక్కకు షరతు పెట్టడం, నక్క ఆవు దగ్గరకు బయలుదేరి వెళ్ళి అడగడం ఆవు "గడ్డి కావాలంటే, నీరు తెమ్మని పొలం చెప్పడం. నక్క కాలువ దగ్గరకు వెళ్ళడం, కాలువ 'కడవ' తెమ్మనడం. కుండ కోసం అమ్మాయి ని అడగడం ఆమె పూసలు కోరడం. షావుకారు కోడిగుడ్డు కోరడం. కోడి గింజలు కోరడం. గింజల కోసం రైతు దగ్గరకు వెళ్లడం. నక్కకు చివరకు తోక లభించడం స్నేహితుల దగ్గరకు అది వెళ్లడంతో కథ ముగుస్తుంది. ఇది 1907 నాటి కథ రైతు ప్రాధాన్యతను, గ్రామంలో ఉత్పత్తి వర్గాల ప్రాధాన్యత చాటే కథ ఇది. ఇలా అన్ని కథలు రష్యన్ దేశం నాటి కాలాన్ని తెలియజేసే చైతన్య కథాంశాలు. అనువాదం బాగుంది.

హెవనేస్ తుమన్యాన్ కథలు-గాధలు,
అనువాదం: పి.చిరంజీవిని కుమారి,
పేజీలు: 92/-, వెల : 60/-
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ బ్రాంచీలు.



- ప్రసన్న కుమారి

అక్షర వజ్ర పుష్పాలు

'విస్తృత జీవితానుభవ నిక్షేపాలు' అంటూ డా॥ ఎస్వీ సత్యనారాయణ 'వజ్ర పుష్పాలు'కు ముందు మాట రాసారు. కవి కట్టా నరసింహారెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయం, భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా వ్యవహరించారు. సమాజంలో జరుగుతున్న నిత్య ఘటనలను అనుభవాలను తెలుగులో కవితా రూపాలుగా అక్షరీకరించారు. 33 కవితలున్న ఈసంపుటిలో చెట్టు, కదలని నాగలి, కృతజ్ఞత, చీకటి, నా నల్లగొండ, జ్ఞాపాలు, మానవత్వం పైదాడి, మనోకలశం, నాన్న కవితలు... పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి. అరువది వత్సరాల ఊసులివి/ జీవితంలో ముసురుకున్న/ అనుభూతుల రాశులివి / జీవితం నేర్పిన భాష్యాలివి (పేజీ 13) అంటారు. "అలుపెరగని పయనం" కవితలో ప్రముఖ కవుల ఆంగ్ల కోట్స్ (సూక్తులు) ఈ పుస్తం విలువ పెంచాయి. పోరాటాల నినాదాలతో ఆయుధమే ఊపిరిగా/ వర్గ సమాజాన్ని చీల్చి చెండాడిన కమ్యూనిస్టుల కంచు కోట అది అంటారు. నా నల్లగొండ కవితలతో చేసిన మేలు మరవద్దనుకుంటే వెలుగు నుండి రాలిన విద్యుతులా/ నీలో రగిలే కృతజ్ఞత దివ్వెనతో నీ రేపటి జీవితాన్ని కాంతి వంతం చేసుకో (పేజీ 63) అంటారు కృతజ్ఞత కవితలో. ప్రభుత్వం పరధ్యానంగా ఉన్నంతకాలం ప్రజల ప్రతిఘటన లేనంత కాలం ఈ రాక్షస లీల సాగుతూనే ఉంటుంది. మరణ మృదంగాలు మ్రోగుతూనే ఉంటాయి. అంటారు 'ఆధునిక పోకడలు" కవితలో (పేజీ 77). మరిన్ని మంచి కవితలు వీరి లేఖ నుండి రావాలని ఆశిద్దాం.

వజ్ర పుష్పాలు, కవి: కట్టా నరసింహారెడ్డి, పేజీలు: 99/-, వెల:65/-, ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, గిరి ప్రసాద్ భవన్, బండ్లగూడ- నాగోల్, హైదరాబాదు.

భిన్న పార్శ్వాల సమాహారం

'ప్రపంచీకరణ-సంస్కృతి' సంకలనం లోని వ్యాసాలు మీడియా, సంస్కృతి, నాగరికత, సామాజిక పోకడల వివిధ పార్శ్వాలను తెలియజేస్తాయి. ఈ వ్యాసకర్తలలో అత్యధికులు అధ్యయనపరులుగా ప్రసిద్ధులే (వారిలో ఒకరిద్దరు ఇప్పుడు సజీవంగా లేరు.). వ్యాసాల నేపథ్యం, అవి రాసిన లేదా ప్రసంగం చేసిన సందర్భాలు కూడా భిన్నమైనవే. అయితే వీటన్నిటిలోనూ పూసల్లో దారంలాగా ఒక ఇతివృత్త ఏకత వుంది. ఆలోచనా పరులైన వారెవరైనా తరచూ ప్రస్తావించుకునే అంశాల పరామర్శ వీటిలో లభిస్తుంది. అలాగే మన ఇంట్లో, సమాజంలో దేశంలో వచ్చిన ఏ అవాంఛనీయ మార్పుల గురించి మనం మథన పడుతుంటామో అవి యాదృచ్ఛికంగా వచ్చినవి కాదని ఈ రచనలు మనకు తెలియజెబుతాయి. కనిపించే తళుకు బెళుకుల వెనక వున్న అదృశ్య అంతర్జాతీయ హస్తాలను చూపిస్తాయి. వాటి వెనుక ఉన్న ప్రయోజనాలను విశ్లేషిస్తాయి. తెలియకుండానే కొన్ని తరాలు ఆ ప్రభావానికి ఎలా లోబడిపోయాయో చెబుతాయి. పైగా ఇవన్నీ ఒకసారి రాసినవి కాకపోవడంలో ఒక సౌలభ్యం కూడా వుంది. ఏమంటే మొదట్లో వూహించిన భయాందోళనలు తర్వాత నిజంగా నిజం కావడం ఇప్పుడు మన అనుభవంలో కనిపిస్తుంటుంది. వ్యాసాలు వివిధ సందర్భాల్లో రాసినవి గనుక అన్నిటి తేదీలు, వివరాలు అందుబాటులో లేవు. కాని అత్యధిక భాగం గత పుష్కర కాలంలోవే. సంస్కృతిపై తెలుగులోనే గాక ఇంగ్లీషులో కూడా ప్రత్యేకంగా పుస్తకాలు ఏమంత అందుబాటులో లేవు. అందుకే ఇది ఆసక్తిరమైనదే గాక అరుదైన సంకలనం అవుతందని ఆశించవచ్చు. అదనంగా ఈ రెండో ముద్రణలో చేర్చిన వ్యాసాలు ఈ పుస్తక ప్రాధాన్యతను మరింతగా పెంచుతాయి.



-స్నేహ

ప్రపంచీకరణ-సంస్కృతి
సంకలనం: తెలకపల్లి రవి
పేజీలు:301/-, వెల: 175/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 27-1-54, ఏలూరు రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ.

రీ సైకిల్డ్ కళ

రీసైకిల్డ్ పేపర్ వాడటానికే చిరాకు పడిపోతారు కొందరు. థామస్ డాంబోకు మాత్రం ఇష్టమైన కళ రీ-సైకిల్డ్ వస్తువులే. వీటిని తానే స్వయంగా చెత్త కుండీల నుంచి, పాడైపోయిన ప్రాంతాల నుంచి సేకరించి వాటితో కళా వస్తువులను, శిల్పాలను సృష్టిస్తాడు. కార్పెంటర్ వృత్తి నుంచి రీ సైకిల్డ్ కళ వైపు మారిన డాంబో పాత ప్లై వుడ్స్, క్రేటర్ పెట్టెలు, చెత్తలో విసిరేసిన ఫర్నిచర్‌తోనే కళాఖండాలను సృష్టిస్తాడు. చిన్న చిన్న విషయాల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు దేన్నీ వ్యర్థం కానీయలేదు తన కళతో. పక్షి ప్రేమికుడు కూడా అయిన డాంబో తన కళను తొలుత ఉపయోగించింది పక్షి గూళ్ల కోసమే. 'హ్యాపీ సిటీ బర్డ్స్' పేరిట పనికి రాని వస్తువులతో సుమారు 3000 పక్షి గూళ్లను రూపొందించి వాటికి ఇళ్లు అమర్చాడు. ఇలా ప్రపంచంలోని అనేక నగరాల్లో నిర్మించాడు. ఎందుకంటే వాటికి నీడ కరువయ్యేది నగరాల్లోనే కదా. తన సొంతూరు డెన్మార్క్‌లోని ఒడెన్స్‌ను 2005లో విడిచి కోల్డింగ్ స్కూల్ ఆఫ్ డిజైన్స్‌లో కళా విభాగంలో విద్యార్థిగా చేరాడు. కోపెన్‌హాగెన్‌లో స్థిరపడి తన కళకు మెరుగులు దిద్దుకుంటూ ఆ నగరాన్ని కాన్వాస్‌గా మార్చేసుకున్నాడు. ఆయన నిర్మాణాలకు ముచ్చట పడిన కోపెన్‌హాగెన్ రైల్వేస్ ఓ భారీ ప్రాజెక్ట్‌నే అప్పగించింది. అక్కడ బాగా ప్రఖ్యాతి పొందిన రోస్కిడ్ ఫెస్టివల్‌కు కూడా పనిచేశాడు. రీసైకిల్డ్ కళను ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ఓ డానిష్ టీవీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు. 'వోరెస్ గెన్‌బ్రగ్షెమ్' (మన రీసైకిల్డ్ ఇల్లు) అనే ఆ షో పనికిరాని వస్తువులతో కళాత్మక వస్తువులను ఎలా తయారు చేసుకోవచ్చో.. గృహాలంకరణకు ఎలా ఉపయోగించవచ్చో.. వివరిస్తున్నాడీ వీధి కళాకారుడు. ●

ADITYA

GROUP OF ENGINEERING, PHARMACY & MANAGEMENT INSTITUTIONS

ENLIGHTENS THE NESCIENCE

www.aditya.ac.in.

1984-2015 31 YEARS OF EXCELLENCE

ADB Road, Surampalem, Kakinada. Cell : 70950 76663, 76664, 76665. E-mai: admissioncell@aec.edu.in

APPROVED BY: AICTE

PERMENANTLY AFFILATED TO: Jawaharlal Nehru Technological University Kakinada; UGC - NET

ACCREDITED BY: NAAC National Assessment and Accreditation Council "A" GRADE

ACCREDITED BY: NBA National Board of Accreditation

ACCREDITED BY: IAO International Accreditation Organization

India's First Microsoft Ed-vantage 100% Genuine Campus

SOUTH INDIA'S FIRST ADOBE CREATIVE TECHNOLOGY ACADEMY

COURSES OFFERED:

- B.Tech
- M.Tech
- BM, BBM
- PGDM
- MBA, MCA
- B.Pharm
- M.Pharm
- Pharma D

Campus Highlights

- Discipline is the hallmark
- A huge campus situated in 180 Acres
- Green zone with zero percent pollution
- Concentrated effort in the learning process
- Separate blocks for Juniors' Class Work
- Periodical feedback from the students
- Industry oriented teaching
- 25 Efficient members in CRT
- E-classrooms
- WiFi Campus
- Project Clubs
- AC Seminar halls
- Open Air Theatre
- Girls waiting halls
- Separate Hostels for Boys & Girls
- AC / Non-AC Hostels

RANKINGS and RATINGS awarded by Reputed Magazines & Journals in their Surveys

- GRADE AA+ CAREERS360
- SOUTH ZONE 4th RANK DIGITAL MAILERS
- South INDIA TOP RANK 6 siliconindia
- ONE of the INDIA's Best ENGINEERING COLLEGE — THE SUNDAY INDIAN
- 13th RANK out of Top 25 Engg. Colleges in INDIA — 4Ps BUSINESS & MARKETING
- Asia's 100 Best & Fastest Growing Private Education Institutes
- ASSOCHAM INDIA

ADITYA - SYNONYM FOR PLACEMENTS

3385 Placements in **2014 -15** still counting ....

Tech Mahindra, WIPRO, IBM, HETERO, Justdial, virtusa, Agile Remedies, HYUNDAI, Infosys, Infosys BPO, TATA, ICICI PRUDENTIAL LIFE INSURANCE, ilm Institute of Leadership & Management, Mphasis, symphony teleca, GENPACT, TATA CONSULTANCY SERVICES

AND MORE COMAPIES....

facebook.com/adityaedugrp
twitter.com/adityaedugrp
youtube.com/user/adityasurampalem
skype adityaedugrp